


కొత్త కలెక్టర్ కీర్తిని అభినందిస్తున్న జిల్లా అధికారిణులు.. కలెక్టర్‌గా తొలిసంతకం

కలెక్టర్‌గా కీర్తి బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం/రూరల్,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్‌గా చేకూరి కీర్తి బాధ్యతలు స్వీకరించారు. బొమ్మూరు కలెక్టరేట్‌లో శనివారం ఉదయం వేద పండితుల ఆశీస్సుల మధ్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె జిల్లాలోని పరిస్థితిని ఆరా తీశారు. ప్రజలకు ఏమి అవసరమో అది అందివ్వగలగడమే మేలు అని ఆమె అనడం గమనార్హం. ఏపీఎన్‌జీవోస్ సంఘం జనరల్ సెక్రటరీ, సామర్ల కోట ట్రైనింగ్ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్‌వీప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.తొలుత ఆమెకు డీఆర్‌వో సీతారామ్మూర్తి, ఆర్‌డీవోలు నాగరాజు నాయక్, రాణిసుస్మిత స్వాగతం పలికారు.హౌసింగ్ పీడీ నాతి బుజ్జి, గ్రామ సచివాలయాల జిల్లా అధికారిణి వీణాదేవి, డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు, ఏవో కిషోర్, జిల్లా విజిలెన్స్ అధికారిణి రత్నకుమారి, డీపీవో శాంతామణి,డీఆర్‌డీఏ పీడీ మూర్తి, ఏపీడీ సుభాషిణి తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఒక టీమ్‌గా పనిచేద్దాం

తొలిరోజునే అధికారులతో కలెక్టర్ కీర్తి సమీక్ష


కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అందరం కలిసికట్టుగా టీమ్‌లా పనిచేసి జిల్లాను అగ్రగామిగా నిలపడానికి పరస్పర సహకారం, సమన్వయం అవసరమని కొత్త కలెక్టర్ చేకూరి కీర్తి అన్నారు. బాధ్యతలు స్వీకరించిన తొలి రోజునే శనివారం కలెక్టరేట్‌లో ఆమె జిల్లా అధికారులతో తొలి సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను అర్థం చేసుకుని అధికారులు పరిష్కార దిశగా అడుగులు వేయాలని సూచించారు.మూడో వ్యక్తి ద్వారా ప్రజా సమస్యలు తన వద్దకు రాకముందే వాటి పరి ష్కార మార్గా లను గుర్తించాలన్నారు. సమస్యలను ముందుగానే అంచనా వేసి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అధికారి విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించి.ప్రజల్లో పరిపాలనా పరం గా నమ్మకం పెంచాలని తెలిపారు. గ్రామ, వార్డు సచివా లయ వ్యవస్థల ద్వారా సేవలు సక్రమంగా అందించా లన్నారు. ప్రజలు ప్రభుత్వంపై ఉంచే నమ్మకాన్ని నిలబెట్టు కోవడం మనందరి బాధ్యత అని స్పష్టం చేశారు. డివిజన్, మండల స్థాయి పీజీ ఆర్‌ఎస్ నిర్వహణలో నిర్లక్ష్యం కారణం గానే కలెక్టరేట్‌కు అనేక మంది వస్తున్నారన్నారు. ఈ నెల 15, 16 తేదీ ల్లో సీఎం చంద్రబాబు కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించ నున్నారని.జిల్లాకు చెందిన ముఖ్య సమస్యలు, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల స్థాయిలో రావలసిన అనుమతులు, నిధులు మంజూరు తదితర అంశాలపై శాఖల వారీగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతకు ముందు గోదావరి పుష్కరాల నిర్వహణ ప్రస్తావన చేశారు. సమావేశంలో డీఆర్‌వో టి.సీతారామమూర్తి, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణిసుస్మిత, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



పొగాకు అధరహో..

పొగాకు ధర అదిరిపోయింది.. కేజీ ధర ఎన్నడూలేనంతగా రికార్డు స్థాయిలో రూ.430లు పలికింది.. గతంలో ఎన్నడూ చూనంతగా ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.. మరింత పెరుగుతుందని చెబుతుండడంతో ఆశగా ఎదురుచూస్తున్నారు..

6

రావులపాలెంనకు చెందిన అబ్బాయికి నల్లజర్లకు చెందిన యువతితో పెళ్లి చూపులు జరిగాయి.. ఒకరికొకరు నచ్చారు.. కట్నం రూ.3 లక్షలు ఇస్తామని చెప్పడంతో ఓకే అనుకున్నారు.. మరి బంగారం ఏం పెడతారని ఇరు తరుపు బంధువులు రంగంలోకి దిగారు. అమ్మాయికి 3 కాసులు పెడతామని వధువు తరపువారు చెప్పారు.. 3 కాసులకు ఏం వస్తుంది.. 10 కాసులు పెట్టాలని డిమాండ్ చేశారు. 10 కాసుల బంగా రానికి 10 లక్షలు అవుతుందని అంత పెట్టలేమని 3 కాసులే పెడతామని వధువు తరపు వారు చెప్పారు.. మళ్లీ కబురుపెడతామంటూ వరుడి తరపు వారు వచ్చేశారు..

పిఠాపురానికి చెందిన యువతీయువకులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు.. ఇద్దరు దగ్గర బంధువులే కావడంతో వివాహం నిశ్చయించారు. అయినప్పటికి బంగారం ఎంత పెట్టాలనే విషయంలో మాత్రం ఎవరు వెనక్కి తగ్గలేదు. మాకు కట్నం ఎంతిచ్చినా పర్వాలేదు. బంగారం మాత్రం మేము అడిగినంత పెట్టాల్సిందే అంటూ పట్టుబట్టారు. పెళ్లికూతురికి అమ్మాయి తరపు వారు 20 కాసులు, పెళ్లి కొడుకు తరపు 10 కాసుల బంగారు ఆభరణాలు పెట్టేలా ఒప్పందం కుదిరింది. పెళ్లికొడుక్కి ఐదు కాసులు పెట్టాలని షరతు పెట్టారు. బంగారం విషయంలో అంగీకారానికి వచ్చి కట్నం మాత్రం అమ్మాయి తరపు వాళ్ల ఇష్టాఇష్టాలకు వదిలేశారు.

రాజమహేంద్రవరానికి చెందిన అమ్మాయికి పాలకొల్లుకు చెందిన అబ్బాయితో పెళ్లి మాటలు జరిగాయి.. వరుడు తరపు వాళ్లు బంగారం ఎంత పెడతారని వధువు తరపు వారిని అడిగారు.. 10 కాసులు పెడతామని చెప్పారు.. మీరెంత పెడతారని వరుడు తరపు వారిని అడిగితే 8 కాసులు అన్నారు.. ఇరు పక్షాల వారు 18 కాసులు వధువుకి పెట్టేలా అంగీకరించారు. అయితే వరుడికి 5 కాసులు బంగారం అడిగారు. అంత పెట్టలేమని 3 కాసులు పెడతామని వధువు తరపు వారు చెప్పారు.. 2 కాసులు పెట్టకపోతే సంబంధం వదిలేసుకోవడానికి సిద్ధమయ్యారు. చివరికి వధువు తరపు వారు తగ్గి 5 కాసులు పెట్టడానికి సుముఖత వ్యక్తం చేయడంతో పెళ్లి ఓకే అయ్యింది..

ఆదివారం ప్రత్యేకం

కనకపు.. సింహాసనం!

పుత్తడిబొమ్మ.. అందనిదమ్మా..



(కాకినాడ/రాజమహేంద్రవరం/మండపేట /పిఠాపురం,ఆంధ్రజ్యోతి)

పెళ్లంటే..
పెళ్లంటే పందిళ్లు.. సందళ్లు..తప్పెట్లు.. తాళాలు.. తలంబ్రాలు.. ఇదంతా ఒకప్పుడు.. ఈ కాలంలో పెళ్లంటే.. కాసులు.. గ్రాములు.. కిలోలు..అంటే బంగారం ఎన్ని కాసులు పెడతారు దగ్గర ఆరంభమై ఎన్ని కిలోల వెండి పెడతారు దగ్గర కథ ముగిస్తున్నారు.. ఎందుకంటే ప్రస్తుతం బంగారం 10 గ్రాములు అక్షరాలా రూ.లక్ష దాటేసింది.. 10 కాసులు బంగారం పెట్టాలంటే రూ.10 లక్షలే.. బంగారం రాకెట్ వేగంతో పరుగులు తీస్తోన్న తరుణంలో వివాహాల్లో బంగారం పెట్టి పోతలు చుక్కలు చూపిస్తున్నా యి. పెళ్లి ఖర్చును మించి బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. అందానికి అందం ఈ పుత్తడిబొమ్మ.. అందరికీ అందకుండా పోయింది.

ఇంట్లో చిన్న వేడుకైనా పిసరంతైనా పసిడి కొనితీరాల్సిందే. పెద్ద పండుగలకు, వివాహాలకు బంగారం లేని వేడుకను ఊహించడం కష్టం. అంతలా మన జీవితాల్లో సువర్ణం ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కొంది. ఎంత పేద వారి పెళ్లయినా కనీసం 10 గ్రాముల బంగారం కొలువుదీరాల్సిందే. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు బంగారం కంటే ఎక్కువగా మెరుస్తున్నాయి.
ఒకవైపు ఈనెల 23 నుంచి వివాహ ముహూర్తాలు ఉన్నాయి. బంగారం ధర గారం చేస్తూ దిగిరానంటోంది. దీంతో ఇంట్లో పెద్ద వాళ్లకు పెళ్లి తంతు, ఖర్చు కంటే పసిడి చింత ఎక్కువైపోయింది. పందిట్లో పడతుల ఒంటిపై పసిడి మెరుపు లొలుకుతూ ఉంటే ఆ కళే వేరు కదా మరి!

పెళ్లింట..బంగారమే!



పసిడి ధర ఎంత పరుగులు తీసినా వధూవరుల కుటుంబాలకు మాత్రం కనకం భారం తప్పడం లేదు. ధర ఎంతకు ఎగబాకినా బంగారం పెట్టిపోతల్లో రాజీ పడడం లేదు. కట్నం అయినా తగ్గించండి కానీ మా అబ్బాయికి పెట్టే బంగారం పెట్టాల్సిందే అంటూ వరుడు కుటుం బం.. మా పాపకు మీరేం బంగారం పెడతారంటూ వధువు కుటుంబం ఎవరికివారు ఆభరణాల్లో రాజీపడడం లేదు. పేద కుటుంబాల్లో వివాహం సమయాల్లో అమ్మాయి తరఫున వధువుకు కాసు (8 గ్రాములు), మధ్యతరగతిలో 40 గ్రాములు, ఎగువ మధ్యతరగతి 250 గ్రాముల వరకు పెట్టిపోతలు పెడతారు. బడాబాబులు అయితే లెక్కేలేదు. ఇది కాకుండా వరుడికి మరికొంత చదివిస్తారు. ఇప్పుడు ధర ఎంత పెరిగినా పెట్టిపోతలు మాత్రం మారలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివాహాల్లో వధూవరుల కుటుంబాల్లో పెట్టిపోతలు నేటికీ కొనసాగుతున్నాయి. దిగువ మధ్యతరగతి కుటుంబాల్లో జరిగే వివాహాల్లో మాత్రం బంగారం పెట్టి పోతల్లో కోతలు వేయకుండా కట్నంలో కొంత తగ్గించుకుంటూ శుభకార్యాలు జరుపుతున్నారు.

కనకం.. చదివింపుల్లేవ్..

కొంతకాలం కిందట వేడుకల్లో బంగారం చదివించే వారు.. పెరిగిన ధరలతో ఇవన్నీ కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం నగదు చదివింపులతో సరిపెట్టేస్తున్నారు.. ప్రస్తుతం ఆభరణాల చదివింపులు మాయమైపోతున్నాయి.. సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు పెళ్లి కోసం మూడు నాలుగు తులాల బంగారం కొనుగోలు చేసేవారు ఇప్పుడు ధర పెరగడంతో సగం అంటే రెండు తులాలకు పరిమితమవుతున్నారు. వెండి ధర భారీగా పెరగడంతో అటు వైపు సామాన్యులెవరు వెళ్లడం లేదు.కేవలం కాళ్లకు పట్టీలు, తప్ప వెండివైపు చూడడం లేదు.

- రికార్డు స్థాయిలో బంగారం ధరలు
- పెళ్లింట పెట్టలేక సతమతం
- చదివింపుల్లోనూ కనుమరుగు
- సామాన్య,మధ్యతరగతికి భారం
- కొనుగోళ్లకు దూరంగా జనం
- ఏడాదిలో రూ.50 వేల వరకూ తేడా



కొనగలమా!

బంగారం ధర అడ్డుఅదుపు లేకుండా పరుగులు తీస్తోంది. రికార్డు స్థాయిలో అందనంతగా పెరిగిపోతోంది.ఒక్క ఏడాది ధరలు డబులు పెరిగాయి. గతేడాది ఇదే సమయానికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.69 వేలు ఉండగా ప్రస్తుతం రూ.1,11,160లు ఉంది. 22 క్యారెట్లు 101900 ఉంది.గతేడాది కిలో వెండి రూ.50 వేల వరకు ఉండగా ప్రస్తుతం కిలో రూ.1,31,600 ఉంది.

బంగారంలా!

వేడుకల్లో వధూవరుల అలంకారంలో కాకి బంగారాన్ని ప్రత్యామ్నాయంగా వాడుతున్నారు. అంటే నాణ్యత తక్కువ కలిగిన లేదా బంగారం మాదిరిగా కనబడే లోహాలతో ఆభరణాలు ఉంటున్నాయి. వేడుకలకు వచ్చే మహిళలు ఎక్కువ శాతం రోల్డు గోల్డు, వన్ గ్రామ్ గోల్డు ఆభరణాలు ధరిస్తున్నారు.చెవిదిద్దుల నుంచీ వడ్డాణం వరకూ రోల్డు గోల్డు నగలు అందుబాటులో ఉండడంతో వాటినే ఎక్కువ శాతం వినియోగిస్తున్నారు.

రెండు కార్పొరేషన్లలో ముగ్గురికి చోటు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల కేటాయింపులో వేగం పెంచింది. అర్హులను పదవులు వరిస్తున్నాయి.దీంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పలువురికి పదవులు దక్కాయి. శనివారం మరో రెండు కార్పొరేషన్లలో జిల్లాకు చెందిన ముగ్గురికి చోటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా కడియం మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మార్గాని సత్యనారాయణను నియమించారు. విశ్వ బ్రాహ్మణ సంక్షేమం,అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లుగా రాజమహేంద్రవరం రూరల్‌కు చెందిన కర్రి అప్పలస్వామి, నిడదవోలుకు చెందిన వసంతవాడ పణీంద్ర కుమార్‌ను నియమించారు.వీరు ముగ్గురూ టీడీపీకి చెందిన వారే కావడం గమనార్హం.

అంగన్వాడీల జిల్లా కమిటీ ఎన్నిక

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తూర్పుగోదావరి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరంలోని విక్రమహాలులో జరిగిన జిల్లా సభలో జిల్లా అధ్యక్షురాలిగా సీహెచ్ మాణిక్యాంబ, ప్రధాన కార్యదర్శిగా కె.బేబీరాణి, కోశాధికారిగా బి.రామలక్ష్మిలను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎస్ఎస్ మూర్తి, జిల్లా ఆఫీస్ బేరర్లు, పది మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ మేరకు పలువురు అభినందనలు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంగన్వాడీలకు జీతాలు పెంచాలని, గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని తీర్మానాలు ఆమోదించారు.సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. సుందరబాబు, బి.పవన్,జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేవంలో గేదెల మృత్యుఘోష

- 25 గేదెలు మృత్యువాత
- అంతుచిక్కని వ్యాధి
- అధికారుల విచారణ


పెద్దేవం గ్రామంలో వ్యాధి బారిన పడిన గేదెను పరిశీలిస్తున్న పశుసంవర్థక శాఖ ఏడీ మోహనాంబ, అధికారులు

తాళ్లపూడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దేవం గ్రామంలో పాడి రైతులు పెద్ద కష్టాన్నే ఎదుర్కొంటున్నారు. గత కొద్ది రోజులుగా పదుల సంఖ్యలో గేదెలు ప్రాణాలు కోల్పోతున్నాయి. గేదెలకు వచ్చిన రోగం ఏమిటో తెలియక రైతులు అల్లాడిపోతున్నారు.ఒక్కసారిగా గేదెలు నీరు తాగక, తిండి ముట్టక రెండు రోజులకే నీరస పడి చనిపోతున్నాయని వాపోతున్నారు. ఇలా ఇప్పటి వరకూ గ్రామంలో 25 వరకూ గేదెలు చనిపోయినట్టు సమాచారం. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఎంతో అబ్బరంగా చూసుకునే గేదెలు ఒక్కసారిగా చనిపోతుండడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. గేదెలకు ఎడమ వైపున చెవి కింద మచ్చ కనపడిందో తమ గేదెలు దక్కవనే నిర్ణయానికి పాడిరైతులు వస్తున్నారు. పశు సంవర్ధక శాఖాధికారి బాలాజీ మాట్లాడుతూ వీటి రోగం కొత్తగా ఉందని కిడ్నీ, లివర్ దెబ్బతింటున్నాయన్నారు. గేదెలు తీసుకునే ఆహారంలో కానీ..తాగే నీటిలో కానీ విషపదార్థాలు కలిసి ఉండొచ్చని అంటున్నారు.మండలంలో ఏ గ్రామంలోనూ ఇటువంటి పరిస్థితి లేదని..పెద్దేవం గ్రామంలోని సుగంధి చెరువు చుట్టూ ఉన్న ప్రాంతంలోనే ఇలా ఉందని అంటున్నారు. ఇక్కడి గడ్డి, నీరు, గేదెల బ్లడ్ శాంపిల్స్ తీసి టెస్టింగ్‌కు పంపామని రిజల్ట్ రావాల్సి ఉందని తెలిపారు. గేదెల వరుస మరణాలపై పశు సంవర్థక శాఖ అధికారులు శనివారం గ్రామంలో విచారణ చేశారు. విషాహారం తినడం వల్ల కానీ.. కలుషిత నీరు త్రాగడం వల్ల కానీ మృతిచెంది ఉండవచ్చనే నిర్ణయానికి వచ్చారు. వ్యాధి బారిన పడిన గేదెలకు అత్యవసరంగా వాడాల్సిన మందులు జాగ్రత్తల గురించి పశుసంవర్థక శాఖ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. పశుసంవర్థక శాఖా ఏడీ (ఏహెచ్) మోహనాంబ, డీడీ వై.కృష్ణ జ్యోతి మాట్లాడుతూ రాష్ట్రంలో మరెక్కడా గేదెలకు ఇటువంటి వ్యాధిని గుర్తించలేదని.. అంతుచిక్కని వ్యాధిగానే ఉందన్నారు. గేదెలు తినే బగ్గిలో విషతుల్యమైన మొక్కలు ఉండి ఉండొచ్చని మరో అనుమానాన్ని వెల్లడించారు. గేదెలు తినే గడ్డి, నీరు, పరిసర ప్రాంతాల్లో మట్టి, గేదెల మూత్రం, పేడ, వాటి రక్తాన్ని శాంపిల్స్ తీసి పరీక్షల నిమిత్తం పంపించామన్నారు. వారి వెంట పశు సంవర్ధక శాఖా అధికారులు డా.రాజేంద్ర ప్రసాద్, డా ఎస్ . వసుంధర, డా ఎం.అనితాదేవి, డా ఏ . వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.


రాజమహేంద్రవరంలో వాన

దంచికొట్టిన వాన

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది.. ఎక్కడక్కడా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి చినుకులు పడుతూనే ఉన్నాయి. జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు, చాగల్లు, నిడద వోలు, గోపాలపురం, దేవరపల్లి, అనపర్తి తదితర మండలాల్లో వానలు కురిశాయి. రాజమహేంద్రవరంలో శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు భారీ వర్షం పడింది. దీంతో నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. వర్షపునీరు సుమారు 20 నిమిషాల పాటు డ్రైనేజీల నుంచి పొంగి రహదారుల మీదకి చేరింది. తెల్లవారుజామున చెదురుమొదరు జల్లులు పడ్డాయి. భారీ వర్షం కారణంగా నగరంలో కంబాలచెరువు, వైజంక్షన్, హైటెక్ బస్టాండ్, రామచంద్రరావుపేట, తాడితోట, స్టేడియం రోడ్డు, కోరుకొండరోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు ,ఆర్‌టిసీ కాంప్లెక్స్ రోడ్డు, పేపరుమిల్లు రోడ్డు, మూలగొయ్యి, ఆర్యాపురం తదితర ప్రాంతాలలో వర్షపునీరు రోడ్డెక్కింది. వివిధ పనులపై రాజమండ్రి వచ్చినవారు ఇబ్బందులు పడ్డారు.

ఉచితమంటే.. ఊరుకుంటారా!

బస్ ఉచితమంటే ఊరుకుంటారా.. ఊరూరా తిరిగేయరు.. ప్రస్తుతం మహిళలు అదే చేస్తున్నారు.. గుంపులు..గుంపులుగా పుణ్యక్షేత్రాలు చుట్టి వచ్చేస్తున్నారు.. ఈ చిత్రంలోనే చూడండి.. ఇది అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని ఆర్టీసీ బస్టాండ్.. శనివారం కావడంతో వాడపల్లికి వచ్చిన మహిళా భక్తజనంతో ఇలా కిటకిటలాడింది. - వివరాలు 6లో



22 నుంచి దేవీనవరాత్రి మహోత్సవాలు


దేవీచౌక్‌లో పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేవిచౌక్‌లో శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి 92వ శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 22 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు 13 రోజుల పాటు, నిర్వహించనున్నట్టు శ్రీదేవి ఉత్సవ సమితి అధ్యక్షుడు బత్తుల రాజ రాజేశ్వరరావు తెలిపారు.దేవిచౌక్‌లోని దేవి కల్యాణ మండపంలో శనివారం ఉత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. 21వ తేదీ రాత్రి శ్రీదేవి విగ్రహ ప్రతిష్ఠ, 22వ తేదీ ఉదయం కలశస్థాపన చేస్తామనానరు. ప్రతిరోజు కుంకుమ పూజలు, ఉదయం సాయంత్రం, అఖండ హారతి 13 రోజులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు ముత్యాల కుమార రెడ్డి, గంధం భైరవస్వామి,ఆకుల వెంకటేశ్వరరావు,అల్లక సత్యనారాయణ, బత్తుల ఈశ్వరరావు, పిల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ ఆలయంలో ఏర్పాట్లు

నిడదవోలు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కోటసత్తెమ్మ ఆలయంలో దేవీనవరాత్రుల మహోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ చైర్మన్ దేవులపల్లి రవి శంకర్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు. 22వ తేదీ సోమవారం కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. ప్రతిరోజు అమ్మవారికి నిత్యాభిషేకం, ప్రత్యేక సహ స్రనామ కుంకుమ పూజలు, ఉదయం చండీ పారాయణం, సాయంత్రం హోమం నిర్వహిస్తామన్నారు. 29వ తేదీ సరస్వతీపూజ, 30వ తేదీ దుర్గాష్టమి, అక్టోబరు 1వ తేది మహార్నవమి, 2వ తేదీ విజయ దశమికి విశేష పూజలు చేస్తారన్నారు.





సెల్‌ఫోన్లకు బందీలయ్యారా..!

● శారీరక, మానసిక సమస్యలు తప్పవు ● మానవ సంబంధాలపై సెల్‌ఫోన్ ప్రభావం..

బూచాడమ్మా బూచాడు బుల్లి పెట్టెలో ఉన్నాడు.. కళ్లకెప్పుడు కనబడడు కబురులెన్నో చెబుతాడు అంటూ మనసు కవి ఆచార్య ఆత్రేయ 55 ఏళ్ల క్రితమే ఫోన్ గురించి మహా గొప్పగా వివరించారు. ఆ ఫోన్లు రూపాంతరం చెందాయి. సెల్‌ఫోన్‌తోనే మనిషి మనుగడ ముడిపడి పోయింది. సెల్‌ఫోన్ లేని జీవితాన్ని ఏ మనిషి ఊహించుకోలేని పరిస్థితి. కులమతాలకు అతీతంగా, ధనిక పేద తారతమ్యం లేకుండా అందరినీ అరచేతిలో బంధించేసింది. సెల్‌ఫోన్‌ను ఎంతవరకు ఎప్పుడు ఎలా ఉపయోగించుకోవాలో అలా ఉపయోగించుకునే వారిని వేళ్ల మీద లెక్కించవచ్చు. కానీ 80 శాతం మంది సెల్‌ఫోన్ బంధిఖానాలో చిక్కుకున్నవారే. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు సెల్‌కు బంధీలే. అటువంటి సెల్‌ఫోన్‌తోనే గంటల తరబడి గడుపుతున్నారా. మరి సెల్‌ఫోన్ స్క్రీన్‌టైమ్ పెరిగితే అనర్థమే అన్న విషయాన్ని మరిచిపోతున్నారు.

శారీరక మానసిక సమస్యలు తప్పవు..

అమలాపురంరూరల్, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు క్రీడల పట్ల కంటే సెల్‌ఫోన్ వినియోగంతోనే కాలం గడిపేస్తున్నారు. ప్రతీ ఇంట్లో ఒక్కొక్కరికి ఒక్కో ఫోన్ విధానంతో కుటుంబ సంబంధాలు దెబ్బతినడంతోపాటు శారీరక మానసిక సమస్యల బారిన పడుతున్నవారు ఎందరో ఉన్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇక అదే ఫోన్‌తో రీల్స్ చేసి డబ్బులు సంపాదించేవారు ఉన్నారు. సర్వం సెల్‌ఫోన్ మయంగా మారిపోవడంతో భవిష్యత్ పరిణామాలు ఏ విధంగా ఉంటాయో అన్న ఆందోళన కూడా ఉంది.

సెల్‌ఫోన్‌తో అనారోగ్య సమస్యలు..

రోజులో ఎక్కువ గంటలు ఫోన్ చూసినా లేక ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడే వారిపై రేడియేషన్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అది మెదడుపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది.



దీనివల్ల కొందరికి బ్రెయిన్ ట్యూమర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగించే వారిలో సంతాన సాఫల్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. కొందరిలో వీర్య కణాల ఉత్పత్తి తగ్గడం, లైంగిక సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

మానసిక సమస్యలు ఇలా..

సెల్‌ఫోన్ ఎక్కువగా చూసే వారిలో బ్లూ లైట్ కంటి మీద పడి బ్రెయిన్‌లోని మెలటోనిన్ దెబ్బ తింటుంది. దీంతో స్లీప్ సైకిల్ అన్‌బ్యాలెన్స్ అవ్వడంతో నిద్ర పట్టకపోవడం, మధ్య రాత్రిలో మెలుకువ వచ్చేస్తోంది. ఇలాంటి వారిలో కోపం, చిరాకు, అసహనం పెరుగుతోంది. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత కోల్పోవడం, చదివింది గుర్తుకు రాకపోవడం జరుగుతోంది. దానివల్ల చదువు దెబ్బతింటుంది. ఇక ఉద్యోగులైతే పనిపై దృష్టి పెట్టలేకపోవడం, కింది స్థాయి సిబ్బందితో అనవసర వాదులాటలకు దిగడం, ప్రవర్తనలో మార్పుతో పాటు కోపం విపరీతంగా పెరిగిపోతుంది. మానసిక సమస్యల్లో భాగంగా కొందరిలో ఆకలి దెబ్బతింటుంది. ఏమీ తినకపోవడంతో పోషకాహారం లోపించి మనిషి ఎదుగుదలపై ప్రభావం చూపిస్తోంది.

సెల్‌తో మానసిక ఒత్తిళ్లు

-డాక్టర్ పి.సౌమ్య, మానిసిక వైద్య నిపుణురాలు, అమలాపురం



సెల్‌ఫోన్ ఎక్కువగా చూసేవారు, మాట్లాడేవారిలో మానసిక ఒత్తిళ్ల పెరుగుతాయి. స్ట్రెస్, యాంగ్జయిటీ కారణంగా నిద్రలేమి సమస్యలు తలెత్తుతాయి. రేడియేషన్ ప్రభావంతో నరాల సమతుల్యత దెబ్బతింటుంది. ఏకగ్రత తగ్గి, జ్ఞాపకశక్తి అంతకంతకు నశిస్తోం ది. రేడియేషన్ ప్రభావంతో ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉత్పన్నం అవుతాయి.

రేపు వికాస జాబ్ మేళా

కాకినాడసిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణులైన 35సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.30వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలకు బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 77993 76222లో సంప్రదించాలన్నారు.

చర్లపల్లి-అనకాపల్లి మధ్య 8 ప్రత్యేక రైళ్లు

సామర్లకోట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి-అనకాపల్లి మధ్య సామర్లకోట మీదుగా ప్రత్యేక రైళ్లను శనివారం నుంచి నడుపుతున్నట్లు రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. 07035 నంబరుగల చర్లపల్లి-అనకాపల్లి ప్రత్యేక రైలు సెప్టెంబరు 13, 20, 27 అక్టోబరు 4వరకూ ప్రతీ శని వారం చొప్పున నాలుగు ట్రిప్‌లుగా నడుస్తోం ది. 07036 నంబరుగల అనకాపల్లి-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు సెప్టెంబరు 14, 21, 28 అక్టోబరు 5 వరకూ ప్రతీ ఆదివారం చొప్పున నాలుగు ట్రిప్‌లు నడుస్తోంది. ఈ ప్రత్యేక రైళ్లు జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం. నిడదవోలు, రాజ



మహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి స్టేషన్లలో హాల్ట్ ఉన్నట్లు తెలిపారు. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్‌క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటుచేసినట్లు సీపీఆర్వో శ్రీధర్ ఆ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లల్లో ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కెట్ల కోసం ఆయా సమీప రైల్వే బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే సీపీఆర్వో తెలిపారు.

కమ్ముకున్న మబ్బులు



తూర్పు కనుమల్లో కనువిందుచేస్తున్న మబ్బులు

కాకినాడ జిల్లా తునిలో శనివారం వేకువ జాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జన జీవనం స్తంభించింది. మెట్టలో కురిసిన జోరువానకు తుని తూర్పు కనుమల్లో జాతీయ రహదారిపై కమ్ముకున్న మబ్బులు చూపరులను కనువిందు చేశాయి.

-తుని రూరల్(ఆంధ్రజ్యోతి)

ఊటీని తలపించేలా..



దేవీపట్నం మండలం నేలకోట గ్రామ సమీపంలో కొండలపై మంచుతెరల్లా మేఘాలు

శనివారం ఉదయం అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో నేలకోట గ్రామ సమీపంలో వర్షం కురిసిన అనంతరం ఊటీని తలపించేలా కొండలపై మేఘాలు తెల్లని మంచుతెరల్లా కమ్మాయి. దీంతో పర్యాటకులను ఆకట్టుకున్నాయి.

-దేవీపట్నం(ఆంధ్రజ్యోతి

ఆల్‌టైం రికార్డు

వర్జీనియా పొగాకు @430

● ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



జంగారెడ్డిగూడెం కేంద్రం-32లో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వర్జీనియా పొగాకు ధరలకు రెక్కలొచ్చాయి. మునుపెన్నడూ లేనివిధంగా కొయ్యలగూడెం వేలం కేంద్రంలో శనివారం కిలో క్వాలిటీ వర్జీనియా పొగాకు ధర రూ.430 పలికింది. ఇది ఎన్ఎల్ఎస్ చరిత్రలోనే రికార్డు ధర. గత ఏడాది కిలోపొగాకుకు అధిక ధర రూ.411 పలకగా ఈ ఏడాది రూ.19అదనంగా పెరిగి రికార్డు సృష్టించింది. శుక్రవారం జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-32లో కిలో పొగాకు ధర రూ.418 చేరింది. ప్రస్తుతం కిలో ధర 430కు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాము పడిన శ్రమకు చివరిలోనైనా ఊరట లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐదు వేలం కేంద్రాల్లో ధరలు ఇలా..

కొయ్యలగూడెం వేలం కేంద్రం- క్వాలిటీ పొగాకు కిలో ధర రూ.430, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-32లో ధర రూ.429, గోపాలపురం వేలం కేంద్రంలో రూ.429, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-18లో రూ.428, దేవరపల్లి వేలం కేంద్రంలో రూ.428,లో-గ్రేడు పొగాకు దేవరపల్లిలో కిలో రూ.130 ఉండగా మిగతా నాలుగు వేలం కేంద్రాల్లో రూ.200గా ఉంది. లో-గ్రేడు పొగాకు ధరలు పెరిగితే రైతులకు లబ్ధి చేకూరినట్లు అవుతుంది.



పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో నిర్వహించిన దత్తహోమంలో పాల్గొన్న భక్తులు

మహాసంస్థానానికి పోటెత్తిన భక్తులు

పిఠాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. శని, ఆదివారాలు వరుస సెలవులు రావడంతో మహారాష్ట్ర, ఒరిస్సాలతో పాటు ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. దర్శనానికి భక్తులు బారులు తీరారు. శ్రీపాదశ్రీవల్లభులకు అభిషేకాలు, దత్తహోమం, గోపూజ నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో సౌజన్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా సాయి



తాళాబత్తుల సాయి

పెద్దాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెద్దాపురం పట్టణానికి చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు, గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు విజేత డాక్టర్ తాళాబత్తుల సాయిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషిచేస్తానని విశ్వబ్రాహ్మణులు, చేతివృత్తుల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని వారికి ప్రభుత్వం ద్వారా వచ్చేటువంటి సంక్షేమ పథకాలను అందించేందుకు కృషిచేస్తానన్నారు. డైరెక్టర్‌గా నియమితులైన సాయి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)కు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ప్రముఖులు, కూటమి నేత లు సాయిని అభినందించారు.

లోక్ అదాలత్‌లో 4733 కేసుల పరిష్కారం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి(ఇన్చార్జి) మాధురి



బ్యాంకు చెక్కు నమూనాను అందజేస్తున్న జడ్జి మాధురి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 4733 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించడం జరిగిందని, దీంతో రాష్ట్రంలో జిల్లా మెరుగైన స్థానంలో ఉందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఇన్చార్జి) ఎం.మాధురి తెలిపారు. రాజమహేంద్రవరం జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదాల్లో మృతి చెందిన కేసుల్లో లోక్ అదాలత్‌లలో రాజీ చేసుకుంటే పరిహారం కోసం ఎక్కువ రోజులు వేచి చూడాల్సిన అవసరం లేదని, బాధితులు తన బ్యాంకు ఖాతాను ఇన్సూరెన్స్ కంపెనీకి తెలియజేసిన నెల రోజుల్లో పరిహారం సొమ్ము ఖాతాలో జమ అవుతుందన్నారు. రాజీ ద్వారా ఇరువర్గాలకూ మేలు జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో 42 ప్రత్యేక న్యాయపీఠాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించగా వివిధ కేసుల్లో రూ.16.36 కోట్ల పరిహారం అందజేసినట్టు మాధురి పేర్కొన్నారు.కార్యక్రమంలో పదో అదనపు జిల్లా జడ్జి ఉమాసునంద, ఏసీబీ కోర్టు జడ్జి వెంకటేశ్వరరావు,ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జానీబాషా తదితర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాలబాలాజీ ఆలయం భక్తులతో కిటకిట



అప్పనపల్లి బాలబాలాజీస్వామి

మామిడికుదురు, సెప్టెంబరు 13ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. వేకువజామునే వేద మంత్రోచ్చారణలతో సుప్రభాత సేవ నిర్వహించి తొలి హారతి ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కొత్త, పాత ఆలయాలు భక్తుల కోలాహలంతో కళకళ్లాడాయి. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఈవో సత్యనారాయణరాజు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

నిత్యాన్నదానానికి రూ.10,116

బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి ఏలూరుకు చెందిన అక్కినేని బాలకృష్ణ-షాజని దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకుడు ఆశీర్వచనం అందించారు. సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

స్వామి వివేకానంద యువతకు ఆదర్శం



ప్రసంగిస్తున్న స్వామి లోకమయానందజీ, పాల్గొన్న పలు కళాశాలల విద్యార్థులు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని స్వామి లోకమయానందజీ మహరాజ్ అన్నారు. స్థానిక రామకృష్ణ మిషన్‌లో శనివారం స్వామి వివేకానంద చికాగో నగర ప్రసంగాల ప్రాముఖ్యత అనే అంశంపై విద్యార్థు లకు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద శీల సంపద,తీక్షణమైన బుద్ధి, అపర మేధాశక్తి కలవారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీ సుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యం వైపు దృష్టి పె ట్టాలని లక్ష్యసాధన కోసం రాత్రింబవళ్లు, కష్టించి, పట్టుదలతో కృషి చేయాలని విద్యార్థులకు హితవు పలికారు. కార్యక్రమంలో స్వామి సేవ్యానందజీ మహరాజ్, స్వామి శశికాంతానందజీ మహరాజ్, స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ ప్రసంగించారు.

భక్తులతో పోటెత్తిన వాడపల్లి క్షేత్రం



స్వామి దర్శనానికి లైన్లలో వేచి ఉన్న భక్తులు

» వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

» స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.81.54 లక్షలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వా మి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. రెండో శనివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం చిరుజల్లులలోను తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వేకుమజామునే స్వామి వారి కి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మీహో మం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పల పుష్పాలతో అలంకరించారు. భారీ లైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన సుంకవల్లి వినిత్ కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళం అందించారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు. స్వామివారి సన్నిధిలో భక్తుల కోసం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధర రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్క రోజు ఆదాయం రూ.81.54 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు తెలిపారు.

బస్సుల కోసం మహిళా భక్తులు ఎదురుచూపులు

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన మహిళా భక్తులు తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూపులు చూశారు.రెండో శనివారం పాఠశాలలకు సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తజనం ఆలయానికి రావడంతో ఉచిత దర్శనం, రూ.50 దర్శనానికి గంటలు తరబడి లైన్‌లో అవస్థలు పడ్డారు. మహిళలకు ఆర్టీసీ ద్వారా ఉచిత ప్రయాణ పథకం ఉండటంతో బస్సుల్లో వివిధ ప్రాంతాలు నుంచి వాడపల్లి సన్నిధికి చేరుకున్నారు. మహిళా భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. శనివారం రాత్రి స్వామి దర్శనం ముగించుకుని తమ ఇళ్లకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు కోసం గంటల తరబడి నిరీక్షించారు. రావులపాలెం నుంచి ఒక బస్సు వస్తే అందులో సుమారు ఎనభై మంది ఎక్కారు. వాడపల్లి నుంచి కొత్త వంతెన వరకు కిలోమీటర్లు మేర ఆర్ అండ్‌బీ రోడ్డు వైపు నడుచుకుంటు ముందుకు సాగారు. మరికొంతమంది రోడ్డు పక్కనే బస్సుల కోసం ఎదురు చూశారు. బస్సు ఆగిన వెంటనే గుంపులు గుంపులుగా బస్సు ఎక్కారు.





వాడపల్లిలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న మహిళలు

కన్నుల పండువగా శాంతి కల్యాణం

శాస్త్రోక్తంగా పూర్ణాహుతి.. ముగిసిన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

కోరుకొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం లో నాలుగు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, సప్తదశ కలశ ప్రోక్షణ, శాంతి కల్యాణం, శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయ అను వంశక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో పండితులు పాణింగపల్లి సత్య పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో చక్రవర్తుల సతీష్‌కుమార్ ఆచార్యులు, వాసాని మణికంఠాచార్యులు పూజా ధికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, యజ్ఞలు, అర్చనలు, అభిషేకాలు జరిగాయి. కార్యక్రమంలో ఆల య అనువంశిక అర్చక స్వాములు, జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి,సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, కర్రి వీరగణేష్, కటకం చలం, తెలగంశెట్టి శ్రీను, గరగ శ్రీధర్‌బాబు, బదిరెడ్డి దొరతోపాటు కోరుకొండ పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

మండపేటలో రాష్ట్ర టెన్నీకాయిట్ పోటీలు



టెన్నీకాయిట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. మండపేటలో రెండురోజులపాటు జరిగే 49వ రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలను శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన ప్రారంభించారు.తొలుత జాతీయ పతాకం ఎగురవేసి క్రీడా జ్యోతిని వెలిగించి ఆటలను ప్రారంభించారు. క్రీడల్లో యువత రాణించి దేశానికి పేరు తీసుకురావాలని వేగుళ్ల పిలుపునిచ్చారు. క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. తొలిరోజు పోటీల్లో 15 జిల్లాలకు చెందిన 15 జట్ల నుంచి 120 మంది క్రీడాకారులు బాలురు, బాలికల విభాగాల్లో తలపడ్డారు. హోరాహోరీగా జరిగిన పోటీల్లో క్రీడాభిమానులకు ఉత్కంఠను రేకెత్తించాయి. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.రాణి, శాప్ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్, ఏపీ టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షురాలు అప్పసాని కృష్ణకుమారి, కోశాధికారి కుంచే రమేష్, ముంగర వెంకట్రాజు, గెడా శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేటీటీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేశవస్వామి సేవలో డీఎస్పీ

ఆత్రేయపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం రాత్రి డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి స్వామి వారి



చిత్రపటం, శేషవస్త్రం సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

పిల్లలు సరిగ్గా చూడట్లేదని గోదావరిలోకి దూకిన వృద్ధుడు

కాపాడిన పోలీసులు



జొన్నాడ బ్రిడ్జి మీద నుంచి గోదావరిలోకి దూకిన వృద్ధుడిని రక్షించి తీసుకొస్తున్న దృశ్యం

ఆలమూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిల్లలు సరిగ్గా చూడట్లేదనే మనస్తాపంతో గోదావరిలోకి దూకేశాడు ఓ వృద్ధుడు. పోలీసులు రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఈ వివరాలను ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన కుంపట్ల సత్యనారాయణ (65) శనివారం ఆలమూరు మండలం జొన్నాడ గౌతమి బ్రిడ్జి నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా రాజమహేంద్రవరం నుంచి అమలాపురం వెళ్తున్న 2023 బ్యాచ్ డీఎస్పీ పి.ప్రదీప్తి గమనించారు. దీంతో స్థానిక ఎస్ఐ నరేష్‌కు సమాచారం అందించగా అక్కడికి దగ్గర్లో ఉండడంతో హుటాహుటిన చేరుకున్నారు. బ్రిడ్జిపై నుంచి దూకి రెయిలింగ్‌కి వేలాడుతున్న వృద్ధుడిని కానిస్టేబుల్ పలివెల రాజు, మొబైల్ హోంగార్డు సాయి, జొన్నాడకు చెందిన జక్కల సూరిబాబు, కోమలి దుర్గప్రసాద్ రక్షించారు. ఆలమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. "నేను బాగా బతికాను. నా పిల్లలు సరిగ్గా చూడట్లేదు. అందుకే మనస్తాపంతో చనిపోవాలనుకున్నాను" అని సత్యనారాయణ పేర్కొన్నాడు.

భార్య పట్టించుకోవట్లేదని విద్యుత్ టవర్ ఎక్కిన భర్త

పోలీసులు నచ్చజెప్పడంతో కిందికి వచ్చిన వైనం

టవర్‌కు పవర్ లేకపోవడంతో తప్పిన ప్రమాదం



కిందకు దిగిన సాయిబాబుకు నీరు తాగిస్తున్న ఏఎస్ఐ పట్టాభిరామయ్య



విద్యుత్ టవర్‌పై సాయిబాబు

పి.గన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో బంధువులు తన భార్యను పుట్టింటికి తీసుకెళ్లడం, ఆమె తనను పట్టించుకోవట్లేదనే కోపంతో భర్త విద్యుత్ టవర్ ఎక్కేశాడు. చివరికి పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో కిందకి దిగి వచ్చాడు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్విడెక్టు సమీపంలో జరిగింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... పి.గన్నవరం మండలం లంకలగన్నవరం శివారు జొన్నల్లంక గ్రామానికి చెందిన పెస్సింగి సాయిబాబు (48) శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన భార్య తో జరిగిన గొడవల నేప థ్యంలో పి.గన్నవరం అక్వి డెక్టు సమీపంలో కొబ్బరి తోటల్లో ఉన్న భారీ విద్యుత్ టవర్ ఎక్కాడు. స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలపగా టవర్ వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం టవర్‌పై ఉన్న సాయిబాబుతో ఏఎస్ఐ ఎస్.పట్టాభిరామయ్య ఫోన్‌లో మాట్లాడారు. నీ సమస్యను మేం పరిష్కరిస్తాం.. ముందు టవర్ దిగాలని నచ్చచెప్పారు. దీంతో సుమారుగా గంట పాటు టవర్‌పై ఉన్న సాయిబాబు పోలీసులు నచ్చచెప్పడంతో కిందికి దిగి వచ్చాడు. సాయిబాబు టవర్‌దిగిన వెంటనే పోలీసులు తాగునీరందించి స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా 3 రోజుల క్రితం భార్య, భర్తకు జరిగిన తగాదాలు నేపథ్యం లో సాయి బాబును ఆమె పుట్టింటి వారు మంద లించి భార్యను తీసుకెళ్లిపోయారని స్థానికులు చెప్తున్నారు. తనకు న్యాయం జరగడంలేదని సాయిబాబు ఆత్మహత్య చేసుకోవడానికి టవర్ ఎక్కాడని అంటున్నారు. కాగా గోదావరికి ఇరు వైపులా ఉన్న భారీ టవర్లకు పవర్ కట్ చేసి పాత అక్విడెక్టుపై నుంచి కొత్తలైన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో టవర్లపై పవర్‌లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెప్తున్నారు.

మూడుసార్లు ఆత్మహత్యాయత్నం...

సాయిబాబు మాట్లాడుతూ "నేను డ్రైవర్‌గా పనిచేస్తూ నా భార్య గంగాభవాని, ముగ్గురు ఆడ పిల్లలకు ఏలోటు లేకుండా చూసుకుంటున్నా. అయినప్పటికి నా భార్య పట్టించుకోవడం లేదు. ఎప్పుడు నా తమ్ముడు, నా అమ్మ అంటుంది. ఈ విషయం జీర్ణించుకోలేక ఆత్మహత్యకు చేసుకుం దామనుకున్నాను. ఇప్పటికే మూడు సార్లు ఆత్మహత్యాయత్నం చేశాను. ఒకసారి గ్రామంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకున్నాను, ఇదే టవర్ 2సార్లు ఎక్కాను. గతం ఇదే టవర్‌పైకి ఎక్కి సగంలో నుంచి కిందికి పడిపోతే గాయాలు కూడా అయ్యాయి" అని పేర్కొన్నాడు.

మహిళ అనుమానాస్పద మృతి

కేసు నమోదు చేసిన రావులపాలెం పోలీసులు



మహిళ మృతదేహం

రావులపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళ అనుమానాస్పదంగా వృతిచెందిన సంఘటనపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లా రావులపాలెం మండలం కొమరాజులంక వంతెన సమీపంలో రహదారి చెంతనే ఒక మహిళ అపస్మారక స్థితిలో పడి ఉండటూ స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 అంబులెన్స్‌లో ఆమెను కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిన్నట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్ల ఉండవచ్చని, రహదారి దాటుతుండగా ఏదైనా వాహనం ఢీకొని వెళ్లిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చంటి తెలిపారు.

అన్నవరం దేవస్థానం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్యాయత్నం

స్థలం కొనుగోలు విషయంలో అన్యాయం జరిగినట్టు వెల్లడి

అన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు శనివారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఒక స్థలం కొనుగోలు విషయంలో తనకు వ్రత పురోహితుడు అన్యాయం చేయడంతో మానసిక క్షోభకు గురై ఈ చర్యకు పాల్పడినట్టు తెలిపారు. సోషల్ మీడియాలో ఈవోకు తనకు విభేదంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తప్పుడు ప్రచారం జరిగిందని అది వాస్తవం కాదన్నారు.

21 మందికి రక్త పరీక్షలు.. 19 మందికి చికున్‌గున్యా

● అనారోగ్యంతో లబ్బర్తి, లాగరాయి, కింద్ర ప్రజలు ● సరిగ్గా అందని వైద్యసేవలు



కింద్రలో ప్రజలతో మాట్లాడుతున్న వైద్య బృందం

రాజవొమ్మంగి సెప్టెంబరు 13 (ఆంధ్రజోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో ప్రజలు అనారోగ్య సమస్యలతో గత 3 నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామాలకు ఇటీవల జిల్లా కలెక్టర్ వచ్చి వెళ్లిన తరువాత రోజే మహిళ అనారోగ్యంతో మృతిచెందడం తెలిసిందే. అయితే అనారోగ్యానికి గల కారణాలు తెలియకపోవడంతో స్టేట్ టీం కింద్రలో ఈనెల 10న వైద్య శిబిరం నిర్వహించి 21మంది నుంచి రక్త నమునాలు సేకరించింది. అయితే వారిలో 19మందికి చికున్‌గున్యా పాజిటివ్ వచ్చినట్టు అధికారులు శుక్రవారం రాత్రి నిర్ధారించారు. అయితే 21 మందికి పరీక్షలు చేస్తే అందులో 19మందికి పాజిటివ్ రావడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జూన్ నెల నుంచే గ్రామంలో ప్రజలు అనారోగ్యానికి గురైతే అప్పట్లోనే అధికారులు ఆరుగురికి రక్త పరీక్షలు చేసి ఒకరికి చికున్‌గున్యా పాజిటివ్ వచ్చినట్టు తెలిపారు. అయితే అప్పట్నుంచి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కేవలం పీహెచ్‌సీ పరిధిలో సిబ్బందితో మెడికల్ క్యాంప్ పెట్టామంటూ తంతు గడిపారే తప్ప అధిక సంఖ్యలో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా చర్యలు చేపట్టలేదు. గ్రామాల్లో పరిస్థితులపై ఆగస్టు 25న ఎంపీపీ గోము వెంకటలక్ష్మి కలెక్టర్‌కు నివేదించడం వల్ల 29న డీఎంహెచ్‌వో వచ్చి ప్రజలతో మాట్లాడి వెళ్లారు. మళ్లీ సెప్టెంబర్ 8న పత్రికల్లో వార్తలు రావడంతో అధికార యంత్రాంగం కదిలి ప్రస్తుతం డిస్ట్రిక్ టీం, స్టేట్ టీం అంటూ గ్రామల్లో చర్యలు చేపడుతున్నారు. ప్రజలు చనిపోతే తప్ప ప్రభుత్వానికి పట్టదా అంటూ ప్రజాప్రతినిధులు ప్రశ్నించినా, అప్పటికే లాగరాయి గ్రామంలో మహిళ మృతిచెందిన ఘటన జరిగింది.

మేం కారకులం కాదు..

లబ్బర్తి, లాగరాయి, కింద్రలో ప్రజలు అనారోగ్యానికి గురికావడానికి కారకులం మేం అంటే మేం కాదు అంటూ వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది వంతు వేసుకుంటున్నారు. 3 గ్రామాల్లో ముందుగా ఒకరికి అనారోగ్యం వచ్చినప్పటికి మిగిలిన వారికి 3 నెలల వ్యవధిలో వ్యాప్తి చెందిందని, అనారోగ్యానికి గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించడం, మందులు ఇవ్వడంలో వైద్యాధికారులు విఫలమయ్యరంటూ సర్పంచ్‌లు చెప్తున్నారు. అయితే గ్రామాల్లో పారిశుధ్య లోపం కారణంగానే అనారోగ్యమంటూ వైద్యాధికారులు వాదిస్తున్నారు.

అర్ధరాత్రి మద్యం దుకాణంలో చోరీ

తునిలో వరుస దొంగతనాలు

తుని రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో దొంగలు హల్‌చల్‌తో పట్టణవాసులు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల వరుస దొంగతనాలు మరువక ముందే శుక్రవారం అర్ధరాత్రి తరువాత మరో దొంగతనం జరిగింది. పట్టణంలో ఫైర్ ఆఫీస్ పక్కన ఉన్న మద్యం దుకాణంలో దొంగ ప్రవేశించి చోరీ చేస్తున్న దృశ్యాలు సీసీపుటేజ్‌లో రికార్డు అయ్యాయి. అదేరోజు మరికొన్ని దుకాణాల్లో దొంగతనాలు జరిగినట్టు తెలుస్తుంది. వీటిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.



మద్యం దుకాణంలో సీసీ పుటేజ్ దృశ్యం

పిఠాపురంలో పిచ్చికుక్క సైర్వవిహారం

పది మందికి తీవ్రగాయాలు

భయాందోళనకు గురైన ప్రజలు



బాధితులకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది



పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో కుక్కకాటు బాధితులు



పిఠాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో శనివారం రాత్రి పిచ్చికుక్క సైర్వవిహారం చేసింది. పదిమందికి పైగా గాయాలయ్యాయి. పట్టణంలోని సాలిపేట, తారకరామనగర్ ప్రాంతాల్లో రోడ్డుపై నడిచి వెళ్తున్న, ఇళ్ల వద్ద బయట ఉన్న వారిని విచక్షణారహితంగా కరిచింది. దారిపొడవునా ఎవరిని వదలకుండా దాడి చేయడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. పది మందికి పైగా తీవ్ర గాయాలు కాగా వారంతా ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమి త్తం వెళ్లారు. కొందరికి లోతుగా గాయాలు కావడంతో వైద్యులు చికిత్స అందించారు. తారకరామనగర్‌కు చెందిన బూరాడ లక్ష్మి, మార్కెట్ వీధికి చెందిన ముత్తుర్తి శివ, సాలిపేటకు చెందిన కాకి కుక్కేటేశ్వరరావు, మేకా వారి వీధికి చెందిన కోట వీర్రాజు, విరవాడ గ్రామానికి చెందిన బొజ్జా వీర వెంకట సత్యనారాయణ, గొల్లప్రోలు పట్టణానికి చెందిన పప్పు వరప్రసాద్ సహా పలువురు గాయాలబారిన పడారు. ఈ ప్రాంతంలో కుక్కల బెడద అధికంగా ఉందని నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

సత్యదేవుడి సన్నిధిలో ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్ జనరల్ పూజలు



సత్యదేవుడి దర్శనానంతరం ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్ జనరల్

అన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో శనివారం ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్ జనరల్, ఐఆర్ఎస్ అధికారి ఆనంద్ రాజేశ్వరీ బెహర్ కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా ఈవో ప్రసాదం అందించారు. అలాగే రాజమండ్రి జాయింట్ కలెక్టర్ కె.రాములు స్వామివారిని దర్శించుకున్నారు.

బాలబాలాజీ దేవస్థానం ఈవోగా సత్యనారాయణరాజు



సత్యనారాయణరాజు

మామిడికుదురు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం ఈవోగా ఎం.సత్యనారాయణరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆయన 94 రోజులు వ్యక్తిగత సెలవుపై విదేశాలకు వెళ్లి తిరిగి శనివారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు జిల్లా దేవదాయశాఖ అధికారి వి.సత్యనారాయణ తాత్కాలిక ఈవోగా వ్యవహరించారు. ఆయనకు ఆలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు.



తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడికి తిరుచ్చిసేవ

అన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొని వచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, మేళతాలాలతో ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

అన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం ఇద్దల దాతల నుంచి రూ.2 లక్షలు విరాళాలుగా సమకూరాయి. విశాఖపట్నంకు చెందిన మద్ది శ్రీనివాసరావు రూ 1,00,116, విజయవాడకు చెందిన పిల్లా అమర్నాధ్, అపర్ణ దంపతులు రూ.1,01,116 విరాళాన్ని ఈవో సుబ్బారావుకు శనివారం అందజేశారు. దాతలను ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం,ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.



విరాళం అందజేస్తున్న దాత అమర్నాధ్

రూల్స్ పాటించని ప్రైవేట్ బస్సులు

రూ.1.93 లక్షల అపరాధ రుసుం

రావులపాలెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట వద్ద జాతీయ రహదారిపై ఈతకోట టోల్‌ప్లాజా వద్ద జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ప్రైవేట్ బస్సులను శనివారం తనిఖీ చేశారు. 20బస్సులు రికార్డులను పరిశీలించగా నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో నిర్వాహకుల నుంచి రూ.1,93,600 అపరాధ రుసుంగా వసూలు చేశారు. దీనిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఒక ప్రైవేట్ బస్సును సీజ్ చేసి రూ.1,22,000 పన్ను, అపరాధ రుసుం వసూళ్లు చేశామని ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీలు ప్రతీ వారం నిర్వహిస్తున్నామని, రహదారి భద్రతా నియమాలను ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలని, అదే విధంగా వారితో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

● సఖినేటిపల్లి రేవులో అదుపు తప్పిన పంటు ● ఒడ్డుకు చేర్చిన డ్రైవర్



సఖినేటిపల్లి రేవులో అలల ఉధృతికి అదుపు తప్పిన పంటు

అంతర్వేది, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో నిత్యం ప్రయాణికులతో పంటు రాకపోకలు రద్దీగా జరుగుతాయి. అయితే శనివారం అలల ఉధృతి కారణంగా పంటు అదుపు తప్పింది. డ్రైవర్ చాకచక్యంతో పంటును ఒడ్డుకు చేర్చడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. చించినాడ వంతెన మరమ్మతుల నేపథ్యంలో బస్సులకు రాకపోకలు నిలిపి వేయడంతో సఖినేటిపల్లి రేవు మీదుగా నర్సాపురం చేరుకునేందుకు ప్రయాణికులు అధికంగా ఉండడంతో, అలల ఉధృతి కూడా పెరగడంతో పంటు అదుపుతప్పింది. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా పంటు డ్రైవర్ నేర్పుతో పంటును ఒడ్డుకు చేర్చాడు. ఇప్పటికైనా అధికారులు ఓవర్ లోడ్ వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కరపలో అగ్నిప్రమాదం

రూ.3 లక్షల ఆస్తినష్టం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కరప, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో శనివారం ఉదయం అగ్నిప్రమాదం జరిగి రూ.3లక్షల ఆస్తి నష్టం సంభవించింది. కరప-పెనుగుదురు ప్రధాన రహదారిలో తిరుమల వైన్స్ షాపును చేర్చి ఆరు గుడిసెల్లో రాయల్ దాబా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం కిచెన్ షెడ్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగి క్షణాల్లో చుట్టూ ఉన్న గుడిసెలకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో మూడు గుడిసెలు అగ్నికి ఆహుతై వాటిక్లని ఫర్నీచర్, ఫ్రిజ్‌లు, కిచెన్ సామాగ్రి కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న జగన్నాయక్‌పూర్ ఫైర్‌స్టేషన్ ఏడీఎఫ్‌వో బి.ఏసుబాబు సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. రెండు గంటల పాటు సిబ్బంది శ్రమించి ఫైరింజన్‌తో మంటలు ఆర్పడంతో పక్కనే ఉన్న వైన్‌షాపు, మిగిలిన మూడు గుడిసెలకు పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టుగా కరప పోలీసులు, అగ్నిమాపకదళ సిబ్బంది ప్రాథమికంగా గుర్తించారు.

ఆంధ్రా రంజీ మాజీ క్రికెట్ ప్లేయర్ శ్రీరామచందర్‌మూర్తి మృతికి సంతాపం



శ్రీరామచందర్ మూర్తి (ఫైల్)

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా రంజీ మాజీ క్రికెట్ ప్లేయర్ మంతెన శ్రీరామచందర్‌మూర్తి మృతికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సానా సతీష్ బాబు, తూర్పుగోదావరి జిల్లా డిస్ట్రిక్ట్ అసోసియేషన్ శనివారం ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా డిస్ట్రిక్ట్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటేష్ మాట్లాడుతూ మంతెన శ్రీరామచందర్‌మూర్తి హైదరాబాద్ అండర్-19 స్కూల్స్ టీం, సౌత్‌జోన్ స్కూల్స్ టీం, అండర్ 25 క్రికెట్ మ్యాచ్‌లు హైదరాబాద్ తరుపున ఆడి కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి డిగ్రీ పూర్తి చేశారని తెలిపారు. అలాగే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తరుపున జూనియర్ స్టేట్, రంజీ ట్రోఫీ, సౌత్ జోన్ యూనివర్శిటీస్‌కు ప్రాతినిధ్యం వహించారన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఆయన తూర్పుగోదావరిజిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కూడా విధులు నిర్వహించారని తెలిపారు. ఆయన మృతి క్రికెట్ సర్కిల్‌లో విషాదం నింపిందన్నారు.

కొమ్మ కొమ్మకో..!



కొమ్మ కొమ్మకు స్టీల్, సిల్వర్ పాత్రలు ఉన్నాయి ఏమిటీ అనుకుంటున్నారా.. అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో దబ్బగూడెం గ్రామంలోని ఓ ఇంటి పెరట్లో ఎండిన చెట్టును ఓ గిరిజనుడు ఇలా మలిచాడు. కడిగిన వంట పాత్రలను ఇలా ఎండిపోయిన చెట్టు కొమ్మలకు తగిలిస్తూ సమయాన్ని ఆదా చేస్తున్నాడు. ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.

– మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)

పీఎం సూర్య ఘర్‌పై అవగాహన కల్పించండి


పథకం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజానగరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనను ప్రజలంతా సద్వినియోగం చేసుకునే దిశగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం హార్టికల్చర్, విద్యుత్ శాఖాధికారులతో వేర్వేరుగా సమీక్షించారు. ఈ పథకంపై అవగాహన కల్పించాలన్నారు. సూర్యఘర్ యోజనలో ఒక్కసారి పెట్టుబడితో వినియోగదారులు 20 ఏళ్ల వరకు ఇంటికి అవసరమైన విద్యుత్‌ను వినియోగించుకోవడంతో పాటు, మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ సంస్థకు విక్రయించడం ద్వారా ఆదాయాన్ని కూడా పొందవచ్చన్నారు. ఆర్‌డీఎస్ఎస్ స్కీం ద్వారా నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు 24గంటల విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఈ సందర్భంగా పథకం బ్రోచర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అలాగే ఉద్యానవన పంటల పంటల విస్తీర్ణాన్ని పెంచే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖాధికారులకు సూచించారు.

ఆటో కార్మికులకు బియ్యం పంపిణీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గోకవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్త్రీ శక్తి పథకం వల్ల ఆటో కార్మికులకు నష్టం వాటిల్లకుండా జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక గోపీకృష్ణ ఫంక్షన్ హాల్లో మండలంలోని ఆటో కార్మికులకు శనివారం ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యాన్ని ఎమ్మెల్యే నెహ్రూ, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పంపిణీ చేశారు. గోకవరం, ఇతర మండలాలతో కలిపి మొత్తం 1700 మందికి పైగా కార్మికులకు బియ్యం పంపిణీ చేసినట్టు నెహ్రూ తెలిపారు. ఆటో కార్మికులందరికీ ఉమ్మడి ఇన్సూరెన్స్ చేయిస్తామని నవీన్ అన్నారు. ఇదిలా ఉండగా గోకవరానికి చెందిన పలువురు ముస్లిం నాయకులు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే నెహ్రూ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు.

గాయపడిన ఆటోడ్రైవర్‌కు ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ టి.చంద్రశేఖర్ కు రాష్ట్ర శెట్టిబలిజ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆర్థికసాయం అందించారు. శనివారం లాలాచెరువు-హౌసింగ్‌బోర్డు కాలనీలో చంద్రశేఖర్ నివాసానికి వెళ్లి పరామర్శించి రూ.15 వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం దసరాకు ఆటో మిత్ర పథకం ద్వారా రూ.15 వేలు అందించనుందని చెప్పారు. ఈ సందర్భంగా సత్తిబాబుకు ది రాజమండ్రి ఆన్ లైన్ ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు కొండా రామచంద్ర, సభ్యులు మడగల చిరంజీవి, టి.సంతోష్, ఎన్.దుర్గారావు, జగపతి తదితరులు పాల్గొన్నారు.

సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి

అనపర్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి పిలుపునిచ్చారు.శనివారం కూటమి కార్యాలయంలో మండల బీజేపీ కార్యశాలలో ఆయన ప్రసంగించారు.ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా పక్షం రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, వాటి విజయవంతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.సమావేశంలో గొల్లు హేమతులసి, సర్పంచ్ గిరిడా గంగాభవాని, గంజా వెంకటకృష్ణ, నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేష్

జిల్లా అధ్యక్షుడు వెంకటేష్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్ (పీటీఐ)లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామవరపు వెంకటేష్ కోరారు. స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో శనివారం జరిగిన పీటీఐల సమావేశానికి వెంకటేష్‌తోపాటు ఆశ్రమ వ్యవస్థాపకుడు గుబ్బల రాంబాబు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తులసి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. వెంకటేష్ మాట్లాడుతూ పీటీఐలకు తక్షణమే జీతాలు విడుదల చేయాలని, ఎంటీఎస్ ఇవ్వాలని, జీతాల బడ్జెట్ ఏడాదికి ఒకసారే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె హామీలను నెరవేర్చాలని జాకబ్ రాజు డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, మిరప రాజు సత్యానందం, వెంకటేష్ పాల్గొన్నారు.

అనపర్తి ఎర్రకాలువలో మహిళ మృతదేహం



అనపర్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎర్రకాలువ వంతెన సమీపంలోని కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. శనివారం ఉదయం కాలువలో మృతదేహం తేలియాడడాన్ని స్థానికులు గమనించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఈతగాళ్ల సహాయంతో మృతదేహన్ని వెలికితీశారు. ఎస్ఐ శ్రీను నాయక్ మాట్లాడుతూ మృతురాలి వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉండొచ్చని ఒంటిపై గోధుమ రంగు జాకెట్టు, కాషాయం రంగు లంగా ఉన్నాయన్నారు. మృతదేహన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు అనపర్తి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

సీతానగరంలో యువకుడి ఆత్మహత్య

సీతానగరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సీతానగరంలోని మావుళ్లమ్మ గుడి సమీపంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామానికి చెందిన వియ్యపు వెంకటేశ్వర్లు(32) సీతానగరం గ్రామానికి చెందిన అంబటి రాంబాబు కుమార్తె సత్యవేణిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. వెంకటేశ్వర్లు మద్యం తాగి ఉరి వేసుకుని మృతిచెందాడని చేసుకున్నాడని సత్యవేణి మేనమామ సమాచారం ఇవ్వడంతో సీతానగరం వచ్చి చూడగా తూర్పు వైపు మంచంపై పడుకున్నట్టు ఉన్నాడని, ఫ్యాన్‌కు చీర వేలాడుతోందని వెంకటేశ్వర్లు సోదరుడు దుర్గాప్రసాద్ పేర్కొన్నాడు. ఈ ఘటనపై తమకు అనుమానాలు ఉన్నాయని దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహన్ని రాజమహేంద్రవరం పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకుమార్ తెలిపారు.

సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ ధ్యేయం : ఎమ్మెల్యే


గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వారంలో ఒక రోజు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కు ప్రజల నుంచి మొత్తం 10 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వీకరించిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు పంపించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మేకల శ్రీను, తుంపల్లి ఆదినారాయణ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ చింతపల్లి సతీష్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చెరువే..

- కాతేరులో భారీ వర్షం
- డ్రైనేజీలు లేక ఇబ్బందులు
- వీధులన్నీ జలమయం..
- కీటకాలు, పాములు సంచారం.. గ్రామస్థుల్లో భయాందోళన


కాతేరులోని ఓ వీధిలో రహదారిపై నిలిచిపోయిన వర్షం నీరు


కాతేరులోని ఖాళీ స్థలాల్లో నిలిచిన వర్షపు నీరు


వర్షం నీటిలో సంచరిస్తున్న పాము

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాతేరు గ్రామంలో చిన్నపాటి వర్షం కురిసినా నీరు పోయే మార్గం లేక వీధులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. అభివృద్ధి అంతా స్థానిక నాయకులు కొన్ని ప్రాంతాలకే పరిమితం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు పంచాయతీ పరిధి వేణుగోపాలపురం, వేగివారి వీధి, హైస్కూల్ తదితర ప్రాంతాల్లో శనివారం కురిసిన భారీ వర్షానికి వీధులన్నీ జలమయమయ్యాయి. ఈ ప్రాంతాల్లో గత పాలకులు రోడ్ల నిర్మాణాలు చేపట్టారు గాని డ్రైనేజీలు నిర్మించలేదు. కనీసం కచ్చాడ్రయిన్లు కూడా పూర్తి స్థాయిలో లేకపోవడంతో నీరెళ్లే మార్గం లేక రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగాన చెట్లు, చెత్త చెదారంగా ఉండడంతో క్రిమి కీటకాలు, పాములు వస్తున్నాయని, మరోవైపు అంటురోగాలు ప్రబలుతున్నాయని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమ ప్రాంతంలో ముంపు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టు ఆశ్చర్యం కలిగించలేదు

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు తమకు ఆశ్చర్యం కలిగించలేదని, కూటమి ప్రభుత్వం తమను అరెస్టులు చేస్తుందని తెలుసని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పేర్కొన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండు ఖైదీగా ఉన్న మిథున్‌రెడ్డిని శనివారం ములాఖత్ ద్వారా సిద్ధార్థ రెడ్డి, వైసీపీ నాయకులు షర్మిలారెడ్డి, గొందేశి శ్రీనివాస రెడ్డి కలిశారు. అనంతరం మీడియా పాయింట్‌లో సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ మిథున్‌ని మానసికంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే అక్రమ కేసులు పెట్టారన్నారు. ఇప్పటి వరకూ కస్టడీ పిటిషన్ వేయకపోవడం దానికి నిదర్శనమని చెప్పారు. నకిలీ మద్యం తాగి వేలాది మంది చనిపోయారని వదంతులు పుట్టించారన్నారు.యూత్‌కి సంబంధించిన అంశాలపై దశల వారీగా ఉద్యమాలు చేపడతామన్నారు.మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిపై గెలిచారంటే మిథున్‌కి ఉన్న పేరు అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో అమ్మాయిలు అదృశ్యమయ్యారని చెబుతున్నారే గానీ ఆధారాలు చూపించడం లేదన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేత


పేద విద్యార్థులకు చెక్కులు అందజేసిన దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పదని ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు అన్నారు. స్థానిక దానవాయిపేటలోని సీసీసీ చానెల్ ఆవరణలో శనివారం పంతం చారిటబుల్ ట్రస్టు వార్షికోత్సవ నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు సేవలను శంకరరావు కొనియాడారు. ద్వారా ఇప్పటివరకు 900 మంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించామని, వారిలో 30 మంది మంచి ఉద్యోగాలు సంపాదించారని కొండలరావు తెలిపారు. ఈ సందర్భంగా 19 మంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించామన్నారు. కార్యక్రమంలో వేగరాజు రాంబాబు, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, అడ్డాల శ్రీనివాస్, నందూరి సుబ్బారావు, కేఎస్ఎన్ రాజు, యనమల రంగబాబు, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబానికి ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ అందజేత


బంగారు కుటుంబానికి ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తవ్వా రాజా తాను దత్తత తీసుకున్న బంగారు కుటుంబంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ అందించారు. స్థానిక 25వ డివిజన్‌కు చెందిన శీలం కుమారి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక చాంబర్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విచ్చేసి కాన్సన్ట్రేటర్ అందించి అనంతరం మాట్లాడుతూ పీ4లో భాగంగా బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సామాజిక సేవ చేయడానికి ముందుకు వచ్చిన తవ్వా రాజాను అభినందించారు. సీఎం చంద్రబాబు పిలుపుతో అనేక మంది మార్గదర్శులు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నారని చెప్పారు.కార్యక్రమంలో చాంబర్ పాలక వర్గ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఫైవ్ మ్యాన్ కమిటీ ఏర్పాటు


ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న రాజేశ్వరరావు

గోకవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఠాణా సెంటర్ సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ భవనంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బయ్యవరపు రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మండల, గ్రామ కమిటీల నిర్మాణం కోసం ఫైవ్ మ్యాన్ కమిటీని ఏర్పాటు చేశారు. ఎంఎస్పీ నాయకుడు గరబారపు శ్రీనివాస్ పర్యవేక్షకుడిగా వ్యవహరించనున్న ఈ కమిటీలో చాపల సూరిబాబు(గోకవరం), మద్దాల శ్రీను(వెదురుపాక), కొల్లి మునలయ్య(తిరుమలాయపాలెం), చింతాటి గణేష్(సంజీవయ్యనగర్), కుందేటి గంగాధర్(కొత్తపల్లి)ను నియమితులయ్యారు. కార్యక్రమంలో దాసరి రవికుమార్, జుత్తుక శ్యామ్, ములపర్తి నాగేశ్వరరావు, బొడ్డపాటి వీరచంద్రం, తోలేటి రాంప్రసాద్, గున్నూరి లాజర్, ఎ.జాన్‌ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

వరి పొలాల్లో డ్రోన్లతో రసాయనాల పిచికారీ


దేవరపల్లిలో డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయాధికారులు

దేవరపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతిక రంగాన్ని ఉపయోగించుకుని అధిక దిగుబడులు సాధించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. దేవరపల్లిలో వరి పొలాలకు డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయశాఖాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో 256 మంది రైతులు 854 ఎకరాల్లో పొలాలకు తమ సిబ్బంది ద్వారా కషాయాలను పిచికారీ చేయించటం జరిగిందన్నారు. డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం ద్వారా పంటకు సక్రమంగా ఎరువులు అందుతాయని, అలాగే తక్కువ ఖర్చుతో ఎక్కువ పొలాలకు పిచికారీ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు సత్యనారాయణ, ఉప్పలపాటి ప్రసన్న, పద్మావతి, సురేఖ, రైతులు జ్యేష్ఠ రమేశ్, జ్యేష్ఠ శ్రీనివాస్, దేవిన వెంకట రామారావు, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు చలో విజయవాడ

కొవ్వూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పతకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీన విజయవాడ లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుందరబాబు తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం వెల్ఫేర్ బోర్డును వైసీపీ ప్రభుత్వం నిలుపుదల చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కాగా, కూటమి ప్ర భుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి, బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీని తక్షణం అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొర య్య, మైగాపుల నాగేశ్వరరావు, మాణికిరెడ్డి హరిబాబు, ఎం.అప్పారావు, ఎం.రామకృష్ణ, ఎస్.కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు

లోక్ అదాలత్‌లో 403 కేసుల పరిష్కారం


కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి రెడ్డి ప్రసన్న

న్యాయమూర్తి రెడ్డి ప్రసన్న

అనపర్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 403 కేసులు పరిష్కరించినట్టు న్యాయమూర్తి రెడ్డి ప్రసన్న తెలిపారు. వీటిలో 18 క్రిమినల్, 8 ఎక్సైజ్, 8 ఎన్ఐయాక్టు, 4 మనీ సూట్, 2 ఈపీ, 351 ఎస్టీసీ(ఫైన్), 12 సీసీ కేసులు పరిష్కారమైనట్టు ఆమె తెలిపారు. వీటి ద్వారా రూ.20.13 లక్షల నగదు సెటిల్మెంట్ జరిగినట్టు న్యాయమూర్తి ప్రసన్న తెలిపారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ప్రతినిధులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌డీపీని సద్వినియోగం చేసుకోవాలి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏపీసీటీఈ-ఏటీపీఎల్ ఆధ్వర్యంలో జరగబోయే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ఆన్‌లైన్ మోడ్‌లో ఆరు రోజులపాటు ఈ శిక్షణా కార్యక్రమం జరుగుతుందని, రేర్ ఎర్త్స్ అండ్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ :క్రిటికల్ మినరల్స్‌పై శిక్షణ ఉంటుందన్నారు. 13 మంది జాతీయ, అంతర్జాతీయ నిపుణులు ఉపన్యాసాలు ఇస్తారని, హాజరైన వారికి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్టు చెప్పారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్లుగా పి.సురేఖ, డి.సంజీవ్ వ్యవహరిస్తారని తెలిపారు. అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులతోపాటు పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి పేదవాడికి వైద్యం అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం సీఎం సహాయనిధి నుంచి సహాయం అందిస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలో పదిహేను మంది లబ్ధిదారులకు వైద్య సహాయం కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.10.96 లక్షల చెక్కులను శనివారం రామవరంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, వైద్యం కోసం ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సీఎం సహాయనిధి కోసం ఎవరైనా తనను సంప్రదించవచ్చని ఆయన అన్నారు. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల కూటమి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా మార్గాని




కడియం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా కడియపులంకకు చెందిన మార్గాని సత్యనారాయణ నియమితులయ్యారు. తనకు పదవి రావడానికి సహకరించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిలకు కృతజ్ఞతలు తెలిపారు. సత్యనారాయణ టీడీపీ మండలాధ్యక్షుడిగా, రాష్ట్ర తెలుగురైతు ఉపాధ్యక్షుడిగా పదవులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

కుమార సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు



బిక్కవోలు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రెండో శనివారం సెలవుదినం కావడం, స్వామి వారి జన్మ నక్షత్రం కృత్తిక కలసి రావడంతో బిక్కవోలులోని శ్రీకుమార సుబ్రహ్మణ్య స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. రెండు వేల మందికి అన్న ప్రసాదాన్ని అందించినట్టు ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 14 సెప్టెంబరు 2025 | 5





కొత్త కలెక్టర్ కీర్తిని అభినందిస్తున్న జిల్లా అధికారిణులు.. కలెక్టర్‌గా తొలిసంతకం

కలెక్టర్‌గా కీర్తి బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం/రూరల్,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్‌గా చేకూరి కీర్తి బాధ్యతలు స్వీకరించారు. బొమ్మూరు కలెక్టరేట్‌లో శనివారం ఉదయం వేద పండితుల ఆశీస్సుల మధ్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె జిల్లాలోని పరిస్థితిని ఆరా తీశారు. ప్రజలకు ఏమి అవసరమో అది అందివ్వగలగడమే మేలు అని ఆమె అనడం గమనార్హం. ఏపీఎన్‌జీవోస్ సంఘం జనరల్ సెక్రటరీ, సామర్ల కోట ట్రైనింగ్ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎన్‌వీ.ప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.తొలుత ఆమెకు డీఆర్‌వో సీతారామ్మూర్తి, ఆర్‌డీవోలు నాగరాజు నాయక్, రాణిసుస్మిత స్వాగతం పలికారు.హౌసింగ్ పీడీ నాతి బుజ్జి, గ్రామ సచివాలయాల జిల్లా అధికారిణి వీణాదేవి, డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు, ఏవో కిషోర్, జిల్లా విజిలెన్స్ అధికారిణి రత్నకుమారి, డీపీవో శాంతామణి,డీఆర్‌డీఏ పీడీ మూర్తి, ఏపీడీ సుభాషిణి తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఒక టీమ్‌గా పనిచేద్దాం

తొలిరోజునే అధికారులతో కలెక్టర్ కీర్తి సమీక్ష



కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అందరం కలిసికట్టుగా టీమ్‌లా పనిచేసి జిల్లాను అగ్రగామిగా నిలపడానికి పరస్పర సహకారం, సమన్వయం అవసరమని కొత్త కలెక్టర్ చేకూరి కీర్తి అన్నారు. బాధ్యతలు స్వీకరించిన తొలి రోజునే శనివారం కలెక్టరేట్‌లో ఆమె జిల్లా అధికారులతో తొలి సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను అర్థం చేసుకుని అధికారులు పరిష్కార దిశగా అడుగులు వేయాలని సూచించారు.మూడో వ్యక్తి ద్వారా ప్రజా సమస్యలు తన వద్దకు రాకముందే వాటి పరి ష్కార మార్గా లను గుర్తించాలన్నారు. సమస్యలను ముందుగానే అంచనా వేసి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అధికారి విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించి..ప్రజల్లో పరిపాలనా పరం గా నమ్మకం పెంచాలని తెలిపారు. గ్రామ, వార్డు సచివా లయ వ్యవస్థల ద్వారా సేవలు సక్రమంగా అందించా లన్నారు. ప్రజలు ప్రభుత్వంపై ఉంచే నమ్మకాన్ని నిలబెట్టు కోవడం మనందరి బాధ్యత అని స్పష్టం చేశారు. డివిజన్, మండల స్థాయి పీజీ ఆర్ఎస్ నిర్వహణలో నిర్లక్ష్యం కారణం గానే కలెక్టరేట్‌కు అనేక మంది వస్తున్నారన్నారు. ఈ నెల 15, 16 తేదీ ల్లో సీఎం చంద్రబాబు కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించ నున్నారని..జిల్లాకు చెందిన ముఖ్య సమస్యలు, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల స్థాయిలో రావలసిన అనుమతులు, నిధులు మంజూరు తదితర అంశాలపై శాఖల వారీగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతకు ముందు గోదావరి పుష్కరాల నిర్వహణ ప్రస్తావన చేశారు. సమావేశంలో డీఆర్‌వో టి.సీతారామమూర్తి, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణిసుస్మిత, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



పొగాకు అధరహో..

పొగాకు ధర అదిరిపోయింది.. కేజీ ధర ఎన్నడూలేనంతగా రికార్డు స్థాయిలో రూ.430లు పలికింది.. గతంలో ఎన్నడూ చూనంతగా ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.. మరింత పెరుగుతుందని చెబుతుండడంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

7

రావులపాలెంనకు చెందిన అబ్బాయికి నల్లజర్లకు చెందిన యువతితో పెళ్లి చూపులు జరిగాయి.. ఒకరికొకరు నచ్చారు.. కట్నం రూ.3 లక్షలు ఇస్తామని చెప్పడంతో ఓకే అనుకున్నారు.. మరి బంగారం ఏం పెడతారని ఇరు తరుపు బంధువులు రంగంలోకి దిగారు. అమ్మాయికి 3 కాసులు పెడతామని వధువు తరపువారు చెప్పారు.. 3 కాసులకు ఏం వస్తుంది.. 10 కాసులు పెట్టాలని డిమాండ్ చేశారు. 10 కాసుల బంగా రానికి 10 లక్షలు అవుతుందని అంత పెట్టలేమని 3 కాసులే పెడతామని వధువు తరపు వారు చెప్పారు.. మళ్లీ కబురుపెడతామంటూ వరుడి తరపు వారు వచ్చేశారు..

పిఠాపురానికి చెందిన యువతీయువకులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు.. ఇద్దరు దగ్గర బంధువులే కావడంతో వివాహం నిశ్చయించారు. అయినప్పటికి బంగారం ఎంత పెట్టాలనే విషయంలో మాత్రం ఎవరు వెనక్కి తగ్గలేదు. మాకు కట్నం ఎంతిచ్చినా పర్వాలేదు. బంగారం మాత్రం మేము అడిగినంత పెట్టాల్సిందే అంటూ పట్టుబట్టారు. పెళ్లికూతురికి అమ్మాయి తరపు వారు 20 కాసులు, పెళ్లి కొడుకు తరపు 10 కాసుల బంగారు ఆభరణాలు పెట్టేలా ఒప్పందం కుదిరింది. పెళ్లికొడుక్కి ఐదు కాసులు పెట్టాలని షరతు పెట్టారు. బంగారం విషయంలో అంగీకారానికి వచ్చి కట్నం మాత్రం అమ్మాయి తరపు వాళ్ల ఇష్టాఇష్టాలకు వదిలేశారు.

రాజమహేంద్రవరానికి చెందిన అమ్మాయికి పాలకొల్లుకు చెందిన అబ్బాయితో పెళ్లి మాటలు జరిగాయి.. వరుడు తరపు వాళ్లు బంగారం ఎంత పెడతారని వధువు తరపు వారిని అడిగారు.. 10 కాసులు పెడతామని చెప్పారు.. మీరెంత పెడతారని వరుడు తరపు వారిని అడిగితే 8 కాసులు అన్నారు.. ఇరు పక్షాల వారు 18 కాసులు వధువుకి పెట్టేలా అంగీకరించారు. అయితే వరుడికి 5 కాసులు బంగారం అడిగారు. అంత పెట్టలేమని 3 కాసులు పెడతామని వధువు తరపు వారు చెప్పారు.. 2 కాసులు పెట్టకపోతే సంబంధం వదిలేసుకోవడానికి సిద్ధమయ్యారు. చివరికి వధువు తరపు వారు తగ్గి 5 కాసులు పెట్టడానికి సుముఖత వ్యక్తం చేయడంతో పెళ్లి ఓకే అయ్యింది..

ఆదివారం ప్రత్యేకం

కనకపు.. సింహాసనం!



పుత్తడిబొమ్మ.. అందనిదమ్మా..

(కాకినాడ/రాజమహేంద్రవరం/మండపేట /పిఠాపురం,ఆంధ్రజ్యోతి)

పెళ్లంటే..

పెళ్లంటే పందిళ్లు.. సందళ్లు..తప్పెట్లు.. తాళాలు.. తలంబ్రాలు.. ఇదంతా ఒకప్పుడు.. ఈ కాలంలో పెళ్లంటే.. కాసులు.. గ్రాములు.. కిలోలు..అంటే బంగారం ఎన్ని కాసులు పెడతారు దగ్గర ఆరంభమై ఎన్ని కిలోల వెండి పెడతారు దగ్గర కథ ముగిస్తున్నారు.. ఎందుకంటే ప్రస్తుతం బంగారం 10 గ్రాములు అక్షరాలా రూ.లక్ష దాటేసింది.. 10 కాసులు బంగారం పెట్టాలంటే రూ.10 లక్షలే.. బంగారం రాకెట్ వేగంతో పరుగులు తీస్తోన్న తరుణంలో వివాహాల్లో బంగారం పెట్టి పోతలు చుక్కలు చూపిస్తున్నాయి. పెళ్లి ఖర్చును మించి బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. అందానికి అందం ఈ పుత్తడిబొమ్మ.. అందరికీ అందకుండా పోయింది.

ఇంట్లో చిన్న వేడుకైనా పిసరంతైనా పసిడి కొనితీరాల్సిందే. పెద్ద పండుగలకు, వివాహాలకు బంగారం లేని వేడుకను ఊహించడం కష్టం. అంతలా మన జీవితాల్లో సువర్ణం ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కొంది. ఎంత పేద వారి పెళ్లయినా కనీసం 10 గ్రాముల బంగారం కొలువుదీరాల్సిందే. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు బంగారం కంటే ఎక్కువగా మెరుస్తున్నాయి. ఒకవైపు ఈనెల 23 నుంచి వివాహ ముహూర్తాలు ఉన్నాయి. బంగారం ధర గారం చేస్తూ దిగిరానంటోంది. దీంతో ఇంట్లో పెద్ద వాళ్లకు పెళ్లి తంతు, ఖర్చు కంటే పసిడి చింత ఎక్కువైపోయింది. పందిట్లో పడతుల ఒంటిపై పసిడి మెరుపు లొలుకుతూ ఉంటే ఆ కళే వేరు కదా మరి!

కనకం.. చదివింపుల్లేవ్..

కొంతకాలం కిందట వేడుకల్లో బంగారం చదివించే వారు.. పెరిగిన ధరలతో ఇవన్నీ కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం నగదు చదివింపులతో సరిపెట్టేస్తున్నారు.. ప్రస్తుతం ఆభరణాల చదివింపులు మాయమైపోతున్నాయి.. సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు పెళ్లి కోసం మూడు నాలుగు తులాల బంగారం కొనుగోలు చేసేవారు ఇప్పుడు ధర పెరగడంతో సగం అంటే రెండు తులాలకు పరిమితమవుతున్నారు. వెండి ధర భారీగా పెరగడంతో అటు వైపు సామాన్యులెవరు వెళ్లడం లేదు.కేవలం కాళ్లకు పట్టీలు, తప్ప వెండివైపు చూడడం లేదు.

- రికార్డు స్థాయిలో బంగారం ధరలు
- పెళ్లింట పెట్టలేక సతమతం
- చదివింపుల్లోనూ కనుమరుగు
- సామాన్య,మధ్యతరగతికి భారం
- కొనుగోళ్లకు దూరంగా జనం
- ఏడాదిలో రూ.50 వేల వరకూ తేడా



పెళ్లింట..బంగారమే!



పసిడి ధర ఎంత పరుగులు తీసినా వధూవరుల కుటుంబాలకు మాత్రం కనకం భారం తప్పడం లేదు. ధర ఎంతకు ఎగబాకినా బంగారం పెట్టిపోతల్లో రాజీ పడడం లేదు. కట్నం అయినా తగ్గించండి కానీ మా అబ్బాయికి పెట్టే బంగారం పెట్టాల్సిందే అంటూ వరుడు కుటుం బం.. మా పాపకు మీరేం బంగారం పెడతారంటూ వధువు కుటుంబం ఎవరికివారు ఆభరణాల్లో రాజీపడడం లేదు. పేద కుటుంబాల్లో వివాహం సమయాల్లో అమ్మాయి తరఫున వధువుకు కాసు (8 గ్రాములు), మధ్యతరగతిలో 40 గ్రాములు, ఎగువ మధ్యతరగతి 250 గ్రాముల వరకు పెట్టిపోతలు పెడతారు. బడాబాబులు అయితే లెక్కేలేదు. ఇది కాకుండా వరుడికి మరికొంత చదివిస్తారు. ఇప్పుడు ధర ఎంత పెరిగినా పెట్టిపోతలు మాత్రం మారలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివాహాల్లో వధూవరుల కుటుంబాల్లో పెట్టిపోతలు నేటికీ కొనసాగుతున్నాయి. దిగువ మధ్యతరగతి కుటుంబాల్లో జరిగే వివాహాల్లో మాత్రం బంగారం పెట్టిపోతల్లో కోతలు వేయకుండా కట్నంలో కొంత తగ్గించుకుంటూ శుభకార్యాలు జరుపుతున్నారు.

కొనగలమా!

బంగారం ధర అడ్డుఅదుపు లేకుండా పరుగులు తీస్తోంది. రికార్డు స్థాయిలో అందనంతగా పెరిగిపోతోంది.ఒక్క ఏడాది ధరలు డబులు పెరిగాయి. గతేడాది ఇదే సమయానికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.69 వేలు ఉండగా ప్రస్తుతం రూ.1,11,160లు ఉంది. 22 క్యారెట్లు 101900 ఉంది.గతేడాది కిలో వెండి రూ.50 వేల వరకు ఉండగా ప్రస్తుతం కిలో రూ.1,31,600 ఉంది.

బంగారంలా!

వేడుకల్లో వధూవరుల అలంకారంలో కాకి బంగారాన్ని ప్రత్యామ్నాయంగా వాడుతున్నారు. అంటే నాణ్యత తక్కువ కలిగిన లేదా బంగారం మాదిరిగా కనబడే లోహాలతో ఆభరణాలు ఉంటున్నాయి. వేడుకలకు వచ్చే మహిళలు ఎక్కువ శాతం రోల్డు గోల్డు, వన్ గ్రామ్ గోల్డు ఆభరణాలు ధరిస్తున్నారు.చెవిదిద్దుల నుంచీ వడ్డాణం వరకూ రోల్డు గోల్డు నగలు అందుబాటులో ఉండడంతో వాటినే ఎక్కువ శాతం వినియోగిస్తున్నారు.

రెండు కార్పొరేషన్లలో
ముగ్గురికి చోటు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల కేటాయింపులో వేగం పెంచింది. అర్హులను పదవులు వరిస్తున్నాయి.దీంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పలువురికి పదవులు దక్కాయి. శనివారం మరో రెండు కార్పొరేషన్లలో జిల్లాకు చెందిన ముగ్గురికి చోటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా కడియం మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మార్గాని సత్యనారాయణను నియమించారు. విశ్వ బ్రాహ్మణ సంక్షేమం,అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లుగా రాజమహేంద్రవరం రూరల్‌కు చెందిన కర్రి అప్పలస్వామి, నిడదవోలుకు చెందిన వసంతవాడ ఫణీంద్ర కుమార్‌ను నియమించారు.వీరు ముగ్గురూ టీడీపీకి చెందిన వారే కావడం గమనార్హం.

అంగన్వాడీల జిల్లా కమిటీ ఎన్నిక

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తూర్పుగోదావరి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరంలోని విక్రమహాలులో జరిగిన జిల్లా సభలో జిల్లా అధ్యక్షురాలిగా సీహెచ్ మాణిక్యాంబ, ప్రధాన కార్యదర్శిగా కె.బేబీరాణి, కోశాధికారిగా బి.రామలక్ష్మిలను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎస్ఎస్ మూర్తి, జిల్లా ఆఫీస్ బేరర్లు, పది మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ మేరకు పలువురు అభినందనలు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంగన్వాడీలకు జీతాలు పెంచాలని, గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని తీర్మానాలు ఆమోదించారు.సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. సుందరబాబు, బి.పవన్,జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేవంలో గేదెల మృత్యుఘోష

- 25 గేదెలు మృత్యువాత
- అంతుచిక్కని వ్యాధి
- అధికారుల విచారణ



పెద్దేవం గ్రామంలో వ్యాధి బారిన పడిన గేదెను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ మోహనాంబ, అధికారులు

తాళ్లపూడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దేవం గ్రామంలో పాడి రైతులు పెద్ద కష్టాన్నే ఎదుర్కొంటున్నారు. గత కొద్ది రోజులుగా పదుల సంఖ్యలో గేదెలు ప్రాణాలు కోల్పోతున్నాయి. గేదెలకు వచ్చిన రోగం ఏమిటో తెలియక రైతులు అల్లాడిపోతున్నారు.ఒక్కసారిగా గేదెలు నీరు తాగక, తిండి ముట్టక రెండు రోజులకే నీరస పడి చనిపోతున్నాయని వాపోతున్నారు. ఇలా ఇప్పటి వరకూ గ్రామంలో 25 వరకూ గేదెలు చనిపోయినట్టు సమాచారం. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఎంతో అబ్బురంగా చూసుకునే గేదెలు ఒక్కసారిగా చనిపోతుండడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. గేదెలకు ఎడమ వైపున చెవి కింద మచ్చ కనపడిందో తమ గేదెలు దక్కవనే నిర్ణయానికి పాడిరైతులు వస్తున్నారు. పశు సంవర్ధక శాఖాధికారి బాలాజీ మాట్లాడుతూ వీటి రోగం కొత్తగా ఉందని కిడ్నీ, లివర్ దెబ్బతింటున్నాయన్నారు. గేదెలు తీసుకునే ఆహారంలో కానీ..తాగే నీటిలో కానీ విషపదార్థాలు కలిసి ఉండొచ్చని అంటున్నారు.మండలంలో ఏ గ్రామంలోనూ ఇటువంటి పరిస్థితి లేదని..పెద్దేవం గ్రామంలోని సుగంధి చెరువు చుట్టూ ఉన్న ప్రాంతంలోనే ఇలా ఉందని అంటున్నారు. ఇక్కడి గడ్డి, నీరు, గేదెల బ్లడ్ శాంపిల్స్ తీసి టెస్టింగ్‌కు పంపామని రిజల్ట్ రావాల్సి ఉందని తెలిపారు. గేదెల వరుస మరణాలపై పశు సంవర్థక శాఖా అధికారులు శనివారం గ్రామంలో విచారణ చేశారు. విషాహారం తినడం వల్ల కానీ.. కలుషిత నీరు త్రాగడం వల్ల కానీ మృతిచెంది ఉండవచ్చనే నిర్ణయానికి వచ్చారు. వ్యాధి బారిన పడిన గేదెలకు అత్యవసరంగా వాడాల్సిన మందులు జాగ్రత్తల గురించి పశుసంవర్ధక శాఖ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. పశుసంవర్ధక శాఖా ఏడీ (ఏహెచ్) మోహనాంబ, డీడీ వై.కృష్ణ జ్యోతి మాట్లాడుతూ రాష్ట్రంలో మరెక్కడా గేదెలకు ఇటువంటి వ్యాధిని గుర్తించలేదని.. అంతుచిక్కని వ్యాధిగానే ఉందన్నారు. గేదెలు తినే బగ్గిలో విషతుల్యమైన మొక్కలు ఉండి ఉండొచ్చని మరో అనుమానాన్ని వెల్లడించారు. గేదెలు తినే గడ్డి, నీరు, పరిసర ప్రాంతాల్లో మట్టి, గేదెల మూత్రం, పేడ, వాటి రక్తాన్ని శాంపిల్స్ తీసి పరీక్షల నిమిత్తం పంపించామన్నారు. వారి వెంట పశు సంవర్ధక శాఖా అధికారులు డా.రాజేంద్ర ప్రసాద్, డా ఎస్ . వసుంధర, డా ఎం.అనితాదేవి, డా ఏ . వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.



చాగల్లులో రోడ్డుపై వరదలా..వాన నీరు..

కొవ్వూరులో నీట మునిగిన ఎంపీడీవో కార్యాలయం

దంచికొట్టిన వాన

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది.. ఎక్కడక్కడా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి చినుకులు పడుతూనే ఉన్నాయి. జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు, చాగల్లు, నిడద వోలు, గోపాలపురం, దేవరపల్లి, అనపర్తి తదితర మండలాల్లో వానలు కురిశాయి. రాజమహేంద్రవరంలో శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు భారీ వర్షం పడింది. దీంతో నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. వర్షపునీరు సుమారు 20 నిమిషాల పాటు డ్రైనేజీల నుంచి పొంగి రహదారుల మీదకి చేరింది. తెల్లవారుజామున చెదురుమొదరు జల్లులు పడ్డాయి. భారీ వర్షం కారణంగా నగరంలో కంబాలచెరువు, వైజంక్షన్, హైటెక్ బస్టాండ్, రామచంద్రరావుపేట, తాడితోట, స్టేడియం రోడ్డు, కోరుకొండరోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు ,ఆర్‌టీసీ కాంప్లెక్స్ రోడ్డు, పేపరుమిల్లు రోడ్డు, మూలగొయ్యి, ఆర్యాపురం తదితర ప్రాంతాలలో వర్షపునీరు రోడ్డెక్కింది. వివిధ పనులపై రాజమండ్రి వచ్చినవారు ఇబ్బందులు పడ్డారు.

ఉచితమంటే.. ఊరుకుంటారా!

బస్ ఉచితమంటే ఊరుకుంటారా.. ఊరూరా తిరిగేయరు.. ప్రస్తుతం మహిళలు అదే చేస్తున్నారు.. గుంపులు..గుంపులుగా పుణ్యక్షేత్రాలు చుట్టి వచ్చేస్తున్నారు.. ఈ చిత్రంలోనే చూడండి.. ఇది అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని ఆర్టీసీ బస్టాండ్.. శనివారం కావడంతో వాడపల్లికి వచ్చిన మహిళా భక్తజనంతో ఇలా కిటకిటలాడింది. - వివరాలు 8లో



22 నుంచి దేవీనవరాత్రి మహోత్సవాలు

దేవీచౌక్‌లో పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేవిచౌక్‌లో శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి 92వ శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 22 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు 13 రోజుల పాటు, నిర్వహించనున్నట్టు శ్రీదేవి ఉత్సవ సమితి అధ్యక్షుడు బత్తుల రాజ రాజేశ్వరరావు తెలిపారు.దేవిచౌక్‌లోని దేవి కల్యాణ మండపంలో శనివారం ఉత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. 21వ తేదీ రాత్రి శ్రీదేవి విగ్రహ ప్రతిష్ఠ, 22వ తేదీ ఉదయం కలశస్థాపన చేస్తామనానరు. ప్రతిరోజు కుంకుమ పూజలు, ఉదయం సాయంత్రం, అఖండ హారతి 13 రోజులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు ముత్యాల కుమార రెడ్డి, గంధం భైరవస్వామి,ఆకుల వెంకటేశ్వరరావు,అల్లక సత్యనారాయణ, బత్తుల ఈశ్వరరావు, పిల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ ఆలయంలో ఏర్పాట్లు

నిడదవోలు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కోటసత్తెమ్మ ఆలయంలో దేవీనవరాత్రుల మహోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు. 22వ తేదీ సోమవారం కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. ప్రతిరోజు అమ్మవారికి నిత్యాభిషేకం, ప్రత్యేక సహ స్రనామ కుంకుమ పూజలు, ఉదయం చండీ పారాయణం, సాయంత్రం హోమం నిర్వహిస్తామన్నారు. 29వ తేదీ సరస్వతీపూజ, 30వ తేదీ దుర్గాష్టమి, అక్టోబరు 1వ తేదీ మహర్నవమి, 2వ తేదీ విజయ దశమికి విశేష పూజలు చేస్తారన్నారు.





కొవ్వూరు పట్టణంలో కురుస్తున్న వర్షం

కురిసింది వాన

● లోతట్టు ప్రాంతాలు జలమయం ● నిలిచిపోయిన రాకపోకలు

కొవ్వూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కొవ్వూరు పట్టణం, మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఒక మోస్తరు కురవగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో చెరువులా మారిపోయింది. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు మధ్యాహ్నం మూడు గంటల సమయం తర్వాత ఆకాశం ఒక్కసారిగా మేఘావృత్తమై సుమారు గంటసేపు వర్షం కురిసింది. దీంతో వారంతా ఊపిరి పీల్చుకుని ఉపశమనం పొందారు.

నిడదవోలు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శనివారం నిడదవోలులో భారీ వర్షం కురి సింది. దీంతో పట్టణంలోని పలుప్రాంతాల్లో డ్రైన్లు పొంగిపొర్లి ప్రవహించాయి. గణపతి, బస్టాండ్ సెంటర్లు జలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

చాగల్లు: మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా రెండు గంటల పాటు పడింది. దీంతో రోడ్లు, డ్రైన్లు పొంగి ప్రవహించాయి. మండలంలో 74.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు తహశీల్దార్ ఎం. మెరికమ్మ తెలిపారు.

నేలకూలిన తాటాకిల్లు

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చాగల్లులో తాటాకిల్లు నేలకూలింది. బెస్త వారి వీధిలో నివాసముంటున్న గొల్లా నాగమణికి చెందిన ఇల్లు కూలిపోవడంతో కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. నాగమణి భర్త, కుమారుడు ఇద్దరు గతంలో మృతి చెందడంతో కోడలు లక్ష్మి, ఇద్దరు మనవళ్లతో కలిసి ఆమె ఉంటున్నారు. మగ దిక్కు లేని కుటుంబం కాగా, ప్రస్తుతం నిలువ నీడలేకుండా పోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోపాలపురం: బంగాళాఖాతంలో ఏర్పడన అల్పపీడన ప్రభావంతో మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండతో పొడిపొడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా ఆకాశంలో కారుమబ్బులు కమ్మాయి. దీంతో మధ్యాహ్నం మూడు గంటల నుంచి రెండు గంటల పాటు వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి గ్రామాల్లో రోడ్ల వెంబడి నీరు ప్రవహించింది. దీంతో ప్రజల రాకపోకలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడింది.



నిడదవోలు గణపతి సెంటర్‌లో కురుస్తున్న వర్షం



రాజంపాలెంలో ఓ వీధిలో ప్రవహిస్తున్న నీరు



చాగల్లులో నేలకొరిగిన తాటాకిల్లు ఎదుట కుటుంబ సభ్యులు

సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ ధ్యేయం : ఎమ్మెల్యే



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వారంలో ఒక రోజు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. సీఎం చంద్ర బాబు ఆదేశాల మేరకు శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు ప్రజల నుంచి మొత్తం 10 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వీకరించిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు పంపించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మేకల శ్రీను, తుంపల్లి ఆదినారాయణ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ చింతపల్లి సతీష్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

15న చలో విజయవాడ



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు

కొవ్వూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పతకాలు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీన విజయవాడ లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుందరబాబు తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం వెల్ఫేర్ బోర్డును వైసీపీ ప్రభుత్వం నిలుపుదల చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి, బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీని తక్షణం అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య, మైగాపుల నాగేశ్వరరావు, మాణికిరెడ్డి హరిబాబు, ఎం.అప్పారావు, ఎం.రామకృష్ణ, ఎస్.కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల్లో డ్రోన్లతో రసాయనాల పిచికారీ



దేవరపల్లిలో డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

దేవరపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతిక రంగాన్ని ఉపయోగించుకుని అధిక దిగుబడులు సాధించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. దేవరపల్లిలో వరి పొలాలకు డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయశాఖాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో 256 మంది రైతులు 854 ఎకరాల్లో పొలాలకు తమ సిబ్బంది ద్వారా కషాయాలను పిచికారీ చేయించటం జరిగిందన్నారు. డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం ద్వారా పంటకు సక్రమంగా ఎరువులు అందుతాయని, అలాగే తక్కువ ఖర్చుతో ఎక్కువ పొలాలకు పిచికారీ చేయవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయశాఖ అధికారులు సత్యనారాయణ, ఉప్పలపాటి ప్రసన్న, పద్మావతి, సురేఖ, రైతులు జ్యేష్ఠ రమేశ్, జ్యేష్ శ్రీనివాస్, దేవిన వెంకట రామారావు, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

తీపర్రులో మండల బీజేపీ నేతల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత వెంకట్రావు, తదితరులు

పెరవలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 తేదీన ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్షోత్సవాలు నిర్వహించాలని బీజేపీ జిల్లా నాయకుడు జి. వెంకట్రావు పేర్కొన్నారు. శనివారం తీపర్రులో మండల బీజేపీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు పార్టీ ఆధ్వర్యంలో ప్రతిరోజూ వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. వీటిలో ప్రధానంగా పాఠశాలలు, ఆసుపత్రులు పరిశుభ్రత, మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలు , తదితర సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజల అభిమానాన్ని చూరగొనాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు రంగినీడి గంగాధరరావు, సింహాద్రి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు లీలాకృష్ణ, రాంబాబు, బోగవల్లి సత్యనారాయణ, శివ తదితర పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లపూడి పోలీస్‌స్టేషన్ తనిఖీ



స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ దేవకుమార్

తాళ్లపూడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి పోలీస్‌స్టేషన్‌ను శనివారం డీఎస్పీ దేవకుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా మాట్లాడుతూ సిబ్బంది పని తీరు సంతృప్తిగా ఉందన్నారు. అలాగే స్టేషన్ పరిధిలో నేరాల సంఖ్య తగ్గిందన్నారు. ప్రధానంగా మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్యపై దృష్టిపెట్టామని ఆర్డీవో, తదితర అధికారులతో చర్చించి ఆక్రమణల తొలగింపు చేపడతామన్నారు. కాగా నేరాల అదుపు కోసం సీసీ కెమెరాల ఏర్పాటు, స్టేషన్‌కి ప్రత్యేక డ్రోన్లను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ విజయ్‌బాబు, ఏస్‌ఐ టీ. రామకృష్ణ, ట్రైనీ ఎస్‌ఐ ఆదిత్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గంలో 106 కేసులు పరిష్కారం

● కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ



జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి అనురాధ

కొవ్వూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో 106 కేసులు రాజీమార్గంలో పరిష్కరించినట్లు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ తెలిపారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం కొవ్వూరు కోర్టు సముదాయాల ప్రాంగణంలో మండల న్యాయ సేవా సంస్థల ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో 3 బెంచ్‌లను ఏర్పాటుచేసి పెండింగ్, ప్రీ లిటికేషన్ కేసులను పరిష్కరించారు. ప్రీ లిటికేసుల నిమిత్తం 1వ బెంచ్‌కు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనూరాధ, న్యాయవాద సభ్యుడిగా వై.చలపతి, సివిల్ కేసులు పరిష్కారం నిమిత్తం 2వ బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి జి.వి.ఎల్.సరస్వతి, న్యాయవాద సభ్యుడిగా ఎం.గోపి, సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారం నిమిత్తం 3వ బెంచ్‌కు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, న్యాయవాద సభ్యుడిగా కె.బ్రహ్మయ్య వ్యవహరించారు. ఈ లోక్ అదాలత్‌లో 29 సివిల్ కేసులను పరిష్కరించి రూ.1,87, 85,446 నష్ట పరిహారం కక్షిదారులకు అందజేశారు. 45 క్రిమినల్ కేసులలో రూ.4,90,000 పరిహారం అందజేశారు. 12 ఎక్సైజ్ కేసులలో రూ.42,965 అపరాధ రుసుము విధించారు. మొత్తం 106 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల శ్రీవారి సేవలో నూతన కలెక్టర్ కీర్తి



స్వామివారి మెమెంటో అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయాన్ని తూర్పుగోదావరి జిల్లా నూతన కలెక్టర్ చేకూరి కీర్తి శనివారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆ తరువాత ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆమెకు స్వామివారి శేషవస్త్రాన్ని అందించి వేదాశీర్వచనం చేశారు. ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు.

పాలంగి చిన్నారికి నాట్యవిపంచి పురస్కారం



పురస్కారం అందుకున్న చిన్నారితో తలిదండ్రులు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో శనివారం నటరాజ కళాకేంద్రం, శ్రీశ్రీకల్చరల్ ఫైన్ ఆర్ట్స్ అకాడమి సంయుక్తంగా నిర్వహించిన 12వ జాతీయ స్థాయి నృత్య, సంగీత పోటీలు సందర్భంగా మండలంలోని పాలంగి గ్రామానికి చెందిన గ్రంధి రత్నసాయి జస్విక అనే చిన్నారి నృత్యంలో ప్రతిభ కనపర్చి నాట్యవిపంచి పురస్కారాన్ని అందుకుంది. బాలబాలికలకు ఇచ్చే పురస్కార ప్రదానోత్సవం- 2025లో భాగంగా ఆరేళ్ల చిన్నారి ఈ పురస్కారాన్ని అందుకుంది. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు గంధ్రి సుబ్రహ్మణ్యం, కీర్తిలు తమ కుమార్తెకు ఈ పురస్కారం రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ బాల్యం నుంచి చిన్నారి నృత్యంపై ఆసక్తి కనపరుస్తున్నట్లు తెలిపారు. తమ కుమార్తెకు నృత్యం నేర్పిన నాట్యగురువు కె. ఖ్యాతేశ్వరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. పాలంగి ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు చిన్నారిని అభినందించారు.

స్వామి వివేకానంద యువతకు ఆదర్శం

స్వామి లోకమయానందాజీ మహరాజ్



ప్రసంగిస్తున్న స్వామి లోకమయానందాజీ

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని స్వామి లోకమయానందజీ మహరాజ్ అన్నారు. స్థానిక రామకృష్ణ మిషన్‌లో శనివారం స్వామి వివేకానంద చికాగో నగర ప్రసంగాల ప్రాముఖ్యత అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద శీల సంపద,తీక్షణమైన బుద్ధి, అపర మేధాశక్తి కలవారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యం వైపు దృష్టి పె ట్టాలని లక్ష్యసాధన కోసం రాత్రింబవళ్లు, కష్టించి, పట్టుదలతో కృషి చేయాలని విద్యార్థులకు హితవు పలికారు. కార్యక్రమంలో స్వామి సేవ్యానందజీ మహరాజ్, స్వామి శశికాంతానందజీ మహరాజ్, స్వామి పరిజ్ఞేయానందాజీ మహరాజ్ ప్రసంగించారు.

బాడీ ఫ్రీజర్ అందజేత



గోపవరంలో గ్రామస్థులకు అందజేస్తున్న దాత మేని సుధాకర్

గోపాలపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోపవరానికి చెందిన మేని మోహనరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మేని సుధాకర్ నూతన శీతల శవపేటిక (బాడీఫ్రీజర్)ను శనివారం గ్రామస్థులకు అం దజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా మృతిచెందితే ఫ్రీజర్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. సుమారు 20 కిలో మీటర్ల మేర వెళ్లాల్సి వచ్చేదన్నారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేని వెంకటరత్నాజీ, శాలివేణు, నవీన్ పాల్గొన్నారు.

చెట్టుకు విద్యుత్ మీటర్..!

● పశివేదలలో పొంచి ఉన్న ప్రమాదం
● భయాందోళనలో స్థానికులు ● పట్టించుకోని అధికారులు



పశివేదలలో ప్రమాదకరంగా చేతికందే ఎత్తులో ఏర్పాటు చేసిన మీటర్

కొవ్వూరు, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): పశివేదల గ్రామంలో సొసైటీకి వెళ్లే నాలుగు రోడ్ల కూడలిలో చేతికి అందే ఎత్తులో విద్యుత్ మీటరు, వైర్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సొసైటీ రోడ్డులో ఇంటిని పూర్తిగా తొలగించి రోడ్డుపై ఉన్న చెట్టుకు మీటరు ఏర్పాటుచేయడంతో విద్యుత్‌వైర్లు తగిలి ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకోస్తుందోనని గ్రామస్థులంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాకాలం.. పాఠశాల విద్యార్థులు తిరుగుతున్నారు. దీనిపై పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ మీటరును రోడ్డుపై తొలగించి ఖాళీ స్థలంలో ఏర్పాటు చేయాలని విద్యుత్ లైన్‌మన్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించున్న పాపానపోలేదని ఆరోపిస్తున్నారు. ఎవరికైనా జరగరానిది జరిగితే.. బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ మీటర్‌ను మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



సమిశ్రగూడెంలో పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

నిడదవోలు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమిశ్రగూడెంలో శనివారం పేద విద్యార్థులకు చాగల్లుకి చెందిన సన్‌రైజ్ మెలియో రిజమ్ ఆర్గనైజేషన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ పుస్తకాలు, స్టేషనరీ అందించింది. కార్యక్రమంలో వీ. వంశీ కిరణ్, ఎస్‌కే అక్రమ్ అలీఖాన్, కే.ఆనంద్, వీ.సతీష్, డీ.సురేంద్ర పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన వాడపల్లి క్షేత్రం



స్వామి దర్శనానికి లైన్లలో వేచి ఉన్న భక్తులు

▸ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు
▸ స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.81.54 లక్షలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వా మి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. రెండో శనివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం చిరుజల్లులలోను తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వేకువజామునే స్వామి వారి కి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మీహో మం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామి వారిని వివిధ రకాల ఫలపుష్పా లతో అలకరించారు. భారీ లైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన సుంకవల్లి వినిత్ కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళం అందించారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు. స్వామివారి సన్నిధిలో భక్తుల కోసం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్క రోజు ఆదాయం రూ.81.54 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు తెలిపారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

బస్సుల కోసం మహిళా భక్తుల ఎదురుచూపు

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన మహిళా భక్తులు తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూపులు చూశారు.రెండో శనివారం పాఠశాలలకు సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తజనం ఆలయానికి రావడంతో ఉచిత దర్శనం, రూ.50 దర్శనానికి గంటలు తరబడి లైన్‌లో అవస్థలు పడ్డారు. మహిళలకు ఆర్టీసీ ద్వారా ఉచిత ప్రయాణ పథకం ఉండటంతో బస్సుల్లో వివిధ ప్రాంతాలు నుంచి వాడపల్లి సన్నిధికి చేరుకున్నారు. మహిళా భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. శనివారం రాత్రి స్వామి దర్శనం ముగించుకుని తమ ఇళ్లకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు కోసం గంటల తరబడి నిరీక్షించారు. రావులపాలెం నుంచి ఒక బస్సు వస్తే అందులో సుమారు ఎనభై మంది ఎక్కారు. వాడపల్లి నుంచి కొత్త వంతెన వరకు కిలోమీటర్లు మేర ఆర్ అండ్‌బీ రోడ్డు వైపు నడుచుకుంటు ముందుకు సాగారు. మరికొంతమంది రోడ్డు పక్కనే బస్సుల కోసం ఎదురు చూశారు. బస్సు ఆగిన వెంటనే గుంపులు గుంపులుగా బస్సు ఎక్కారు.



వాడపల్లిలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న మహిళలు

వివాహిత అదృశ్యంపై కేసు

కొవ్వూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్‌ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి... పట్టణానికి చెందిన నాగిరెడ్డి సత్య దేవసేన ఈనెల 11వ తేదీ మధ్యాహ్నం విక్టరీ బజారుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి ఎంతటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతకసాగారు. దీంతో ఫలితం లేకపోవడంతో భర్త మణి వెంకట సత్యనారాయణ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తెలిపారు. మహిళ అచూకీ తెలిసినవారు 9440796622, 91548 75583 నెంబర్లకు సమాచారమివ్వాలన్నారు.

భారీ అన్నసమారాధన



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

దేవరపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెరకవీధి వినాయకుని ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా దీన్ని ఏర్పాటు చేశారు.